


# ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE


సంపుటి: 02 | సంచిక: 12 | ఎడిటర్: మేనం శ్యామ్ | శుక్రవారం 31-07-2026 | పేజీలు: 10


## సిరా చుక్క

వీర్రవీగకు... వీర్రవిగకు...
ఎందుకయ్యా మీకంత అహంకారం..
మిమ్మల్ని దాటి వార్తలు రాస్తున్నారనేనా
ఆ ఆగ్రహం..
పెద్ద పత్రికలే ప్రజల స్వరమా..
చిన్న పత్రికలకు ప్రశ్నించే హక్కు లేదా..
మీ గడప దాటితేనే వార్త పుడుతుందా..
మా కలం రాస్తే మీ కుర్చీ కదులుతుందా..
మేము అడిగేది అధికారాన్ని కాదు,
ప్రజల హక్కును.
మేము రాసేది ప్రచారం కోసం కాదు,
ప్రజల సమస్యలకు పరిష్కారం కోసం.
చిన్న పత్రికను చిన్నచూపు చూడొచ్చు,
కానీ దాని వెనుక నిలిచిన
ప్రజల గొంతును మూయలేరు.
వీర్రవీగకు... వీర్రవిగకు...
మిమ్మల్ని దాటి వార్తలు రాశారనే కోపమా..
లేక... నిజం రాశారనే భయమా..
కలం చిన్నదైనా...
మా ప్రశ్న మాత్రం పెద్దదే..

– భాస్కర్ యాదవ్ ..
ప్రజా వాయిస్ బ్యూరో చీఫ్...






## తుపాకీ మౌనమైంది... ప్లకార్డు గర్జిస్తోంది

- అడవి నుంచి రాజధాని వీధుల దాకా రూపం మార్చుకున్న నిరసన స్వరం
- ఎన్‌కౌంటర్లతో ఆలోచనలకు ముగింపు ఉంటుందా.?
- ప్రజాస్వామ్యంలో చివరి మాట ప్రజలదే

**ప్రజా వాయిస్, హుజూర్‌నగర్:** ఒకప్పుడు చేతిలో తుపాకీ ఇప్పుడు చేతిలో ప్లకార్డుఒకప్పుడు అడవుల్లో వినిపించిన నినాదాలు నేడు దేశ రాజధాని వీధుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. మారింది రూపం మాత్రమే. మారని విషయం ప్రజల ఆవేదన. ఆకలి, అన్యాయం, నిరుద్యోగం, అసమానతలు ఉన్నంతకాలం నిరసనకు కొత్త రూపాలు పుడుతూనే ఉంటాయనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. సాయుధ ఉద్యమాన్ని అణచివేయడం ద్వారా సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని భావించడం వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించదని విశ్లేషకులు పేర్కొంటున్నారు. తుపాకీని స్వాధీనం చేసుకోవచ్చు, దళాలను చెదరగొట్టవచ్చు. కానీ ప్రశ్నించే మనసులను, న్యాయం కోరే గొంతులను బలప్రయోగంతో ఎప్పటికీ మూయించలేరని అభిప్రాయపడుతున్నారు.ఒక జంతర్‌మంతర్‌ను ఖాళీ చేయించవచ్చు. కానీ

మిగతా 2లో

2 లో

## పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితి విషమం

- అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం
- హార్ట్ ఎటాక్ కాదు.. ఊపిరితిత్తుల సమస్య వల్లే అస్వస్థత అని హరీష్ రావు వెల్లడి
- 30–40 నిమిషాలు గుండె పని చేయక మెదడుకు ఆక్సిజన్ సరఫరా నిలిచిందని వివరాలు
- అమెరికా, లండన్, ముంబై వైద్యులతో సంప్రదింపులు.. రిపోర్టులు విదేశాలకు పంపింపు
- అభిమానులు ఆసుపత్రికి రావద్దని విజ్ఞప్తి చేసిన హరీష్ రావు



2 లో



## చర్లపల్లి ఫ్యాబ్రికేషన్ కంపెనీలో ఘోర ప్రమాదం

- యంత్ర ప్రమాదంలో కార్మికుడు మృతి
- చర్లపల్లి పారిశ్రామికవాడలోని సుదర్శన ఇండస్ట్రీస్‌లో విషాద ఘటన
- సీఎన్సీ యంత్రాన్ని పరిశీలిస్తుండగా ప్రమాదానికి గురైన ఆపరేటర్
- ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు
- భద్రతా ప్రమాణాలపై దర్యాప్తు
- మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని సహచర కార్మికుల డిమాండ్

# 2034 వరకు నేనే ముఖ్యమంత్రి

- విద్యలో ప్రపంచ స్థాయి సంస్కరణలు తీసుకొస్తాం
- సీఎం రేవంత్ రెడ్డి
- ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తాం
- సంఘాలు సమస్యలు తనకు వదిలేయాలని సీఎం సూచన
- మండల స్థాయి నుంచి విద్యా సంస్కరణలపై నివేదికలు ఇవ్వాలని ఉపాధ్యాయులకు పిలుపు
- వచ్చే విద్యా సంవత్సరం నుంచే కీలక మార్పులు అమలు చేస్తామని ప్రకటన
- ప్రతి విద్యార్థిపై రూ.1.08 లక్షలు ఖర్చు చేస్తున్నామని వెల్లడి




**హైదరాబాద్, ప్రజా వాయిస్:** తెలంగాణ ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఫిన్‌లాండ్, జర్మనీ దేశాల్లో విద్యా వ్యవస్థను అధ్యయనం చేసి వచ్చిన ఉపాధ్యాయుల బృందంతో నిర్వహించిన ఇంటరాక్షన్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. రాష్ట్రంలో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కూడిన విద్యా వ్యవస్థను నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రకటించారు.

**2034 వరకు నేనే ముఖ్యమంత్రి**

తాను 2034 వరకు తెలంగాణ ముఖ్యమంత్రిగానే కొనసాగుతానని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఆలోపు రాష్ట్ర విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చి, తెలంగాణ విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడే స్థాయికి చేరేలా చర్యలు చేపడతామని తెలిపారు.

**ఉపాధ్యాయుల సమస్యలు నా బాధ్యత**

ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం ఇప్పటికే ప్రాధాన్యతతో పరిష్కరిస్తోందని సీఎం చెప్పారు. ప్రతి నెల ఒకటో తేదీనే ఉపాధ్యాయులకు జీతాలు చెల్లిస్తున్నామని గుర్తు చేశారు. బదిలీలు, పదోన్నతులు కూడా అడగకుండానే కల్పించామని పేర్కొన్నారు. ఇకపై ఉపాధ్యాయ సంఘాలు తమ సమస్యలను తనకే వదిలేయాలని,

మిగతా 2లో



## ప్రయాణికులకు టీజీఎస్ఆర్టీసీ గుడ్‌న్యూస్

- బస్ టికెట్‌తోనే ఈ-ఆటో బుకింగ్ సౌకర్యం
- 'ఫస్ట్ మైల్ టు లాస్ట్ మైల్ కనెక్టివిటీ'తో కొత్త సేవలకు టీజీఎస్ఆర్టీసీ శ్రీకారం
- బస్ టికెట్‌తో పాటు ఒకేసారి ఈ-ఆటో టికెట్ బుక్ చేసుకునే అవకాశం
- తొలిదశలో హైదరాబాద్.. తర్వాత వరంగల్, కరీంనగర్ సహా ప్రధాన నగరాలకు విస్తరణ
- ఓలా, ఊబర్, ర్యాపిడో కంటే తక్కువ ఛార్జీలతో సేవలు అందించనున్న టీజీఎస్ఆర్టీసీ

2 లో

## మేడ్చల్‌కు మెట్రో కావాలంటూ భారీ పాదయాత్ర

2 లో

- ఆగస్టు 2 నుంచి ఉద్యమానికి శ్రీకారం
- మేడ్చల్ మెట్రో సాధన సమితి ఆధ్వర్యంలో పాదయాత్రకు పిలుపు
- జీడిమెట్ల గాంధీ విగ్రహం నుంచి జేబీఎస్ మెట్రో హబ్ వరకు పాదయాత్ర
- "మెట్రో విలాసం కాదు.. ప్రజల అవసరం" అంటూ ఉద్యమకారుల నినాదం
- నార్త్ సిటీకి మెట్రో ప్రకటించే వరకు ప్రతి వీకెండ్ నిరసనలు కొనసాగిస్తామని స్పష్టం..

HYDERABAD METRO RAIL

## వందేమాతరం బిల్లుపై ఓవైసీ తీవ్ర విమర్శలు

2 లో

- రాజ్యాంగ ఉల్లంఘన అంటూ ఆరోపణలు
- పార్లమెంట్ ఆమోదించిన వందేమాతరం బిల్లును వ్యతిరేకించిన అసదుద్దీన్ ఓవైసీ..
- 'జనగణమన ప్రజల కోసం.. వందేమాతరంలో దేవతారాధన ఉంది' అంటూ వ్యాఖ్యలు
- రాజ్యాంగంలోని 25, 26, 29a అధికరణల ఉల్లంఘన జరుగుతోందని ఆరోపణ
- 1950లో వందేమాతరంపై అధికారిక తీర్మానం జరగలేదని వ్యాఖ్య

## తెలంగాణ జలాశయాలకు కొనసాగుతున్న వరద ప్రవాహం

- గోదావరిలో నీటిమట్టం పెరుగుదల
- కృష్ణా బేసిన్ ప్రధాన జలాశయాలకు ఎగువ ప్రాంతాల నుంచి స్థిరంగా వరద ప్రవాహం
- జూరాలకు భారీ ఇన్‌ఫ్లో.. విద్యుత్ ఉత్పత్తితో పాటు దిగువకు నీటి విడుదల
- శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో ప్రస్తుతం సాధారణ స్థాయిలోనే నీటి విడుదల
- భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 27 అడుగులకు చేరిక.. గంటగంటకూ పెరుగుతున్న వరద
- ఎల్లంపల్లి, నిజాంసాగర్, సింగూరు జలాశయాలకు కొనసాగుతున్న భారీ నీటి చేరిక



**హైదరాబాద్, ప్రజా వాయిస్:** తెలంగాణలో కురుస్తున్న వర్షాలు, ఎగువ రాష్ట్రాల నుంచి వస్తున్న వరద ప్రవాహాలతో రాష్ట్రంలోని ప్రధాన జలాశయాలు క్రమంగా నిండుతున్నాయి. ముఖ్యంగా కృష్ణా, గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లో నీటి ప్రవాహం పెరుగుతుండటంతో జలాశయాల్లో నిల్వలు మెరుగుపడుతున్నాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతుండగా, నదులు, రిజర్వాయర్లు జలకళను సంతరించుకున్నాయి.

**జూరాలకు భారీ వరద ప్రవాహం**

కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల నుంచి విడుదలవుతున్న నీటితో జూరాల ప్రాజెక్టుకు సుమారు 32 వేల నుంచి 46,580 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. విద్యుత్ ఉత్పత్తితో పాటు గేట్ల ద్వారా దాదాపు 30,700 నుంచి 44,254 క్యూసెక్కుల నీటిని

మిగతా 2లో

# మేడ్చల్‌కు మెట్రో కావాలంటూ భారీ పాదయాత్ర

**హైదరాబాద్, ప్రజా వాయిస్:** మేడ్చల్ ప్రాంతానికి మెట్రో రైలు సదుపాయాన్ని పొడిగించాలని డిమాండ్ చేస్తూ మేడ్చల్ మెట్రో సాధన సమితి భారీ పాదయాత్రకు పిలుపునిచ్చింది. ఆగస్టు 2 నుంచి ఈ పాదయాత్ర ప్రారంభం కానుండగా, జీడిమెట్లలోని గాంధీ విగ్రహం వద్ద ప్రారంభమై జేబీఎస్ మెట్రో హబ్ వరకు కొనసాగనుంది.

**మెట్రో విలాసం కాదు.. అవసరం**

మేడ్చల్ ప్రాంత ప్రజలకు మెట్రో విలాసవంతమైన రవాణా సౌకర్యం కాదని, నిత్యావసరమని సాధన సమితి సభ్యులు పేర్కొన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో మెట్రో విస్తరణ అత్యవసరమని వారు అభిప్రాయపడ్డారు.

**ట్రాఫిక్‌కు శాశ్వత పరిష్కారం**

మెట్రో రైలు అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు, సొంత వాహనాల వినియోగం తగ్గి వాతావరణ కాలుష్యం నియంత్రణలోకి వస్తుందని తెలిపారు. అలాగే ప్రయాణ సమయం ఆదా కావడంతో పాటు రోడ్డు ప్రమాదాలు కూడా తగ్గే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

**ప్రతి వీకెండ్ నిరసనలు**

మేడ్చల్‌తో పాటు నార్త్ సిటీ ప్రజల ప్రయోజనాలపై ప్రభుత్వం దృష్టి సారించే వరకు ప్రతి వీకెండ్ నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామని మేడ్చల్ మెట్రో సాధన సమితి నిర్వాహకులు స్పష్టం చేశారు. మెట్రో విస్తరణపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# 2034 వరకు నేనే ముఖ్యమంత్రి



**మొదటి పేజీ తరువాయి**

వాటి పరిష్కార బాధ్యత పూర్తిగా తానే తీసుకుంటానని హామీ ఇచ్చారు.

**విద్యా సంస్కరణలకు ఉపాధ్యాయుల సూచనలు**

మండల స్థాయి నుంచి విద్యలో తీసుకురావాల్సిన మార్పులపై ఉపాధ్యాయులు నేరుగా సీఎంఓకు నివేదికలు పంపాలని సీఎం కోరారు. ఆ నివేదికల ఆధారంగా సమగ్ర విధాన నిర్ణయాలు తీసుకుని, వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే కొత్త సంస్కరణలను అమలు చేస్తామని వెల్లడించారు.

**ప్రపంచ స్థాయి విద్యే లక్ష్యం**

ప్రస్తుతం రాష్ట్రంలో విద్యా వ్యవస్థ బలోపేతం అవుతోందని, అయితే ప్రపంచంతో పోటీ పడాలంటే మరింత నాణ్యమైన విద్య అవసరమని సీఎం అభిప్రాయపడ్డారు. విద్యలో నాణ్యత పెరగడంతో పాటు విద్యార్థులకు పౌష్టికాహారం కూడా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రతి విద్యార్థిపై ప్రభుత్వం రూ.1.08 లక్షలు ఖర్చు చేస్తోందని వెల్లడించారు.

**డ్రాపౌట్స్ తగ్గాయి.. అడ్మిషన్లు పెరిగాయి**

2014 నుంచి 2023 మధ్య కాలంలో పాఠశాలల్లో డ్రాపౌట్స్ పెరిగాయని, అయితే 2023 నుంచి 2026 వరకు డ్రాపౌట్స్ తగ్గి అడ్మిషన్లు పెరిగాయని సీఎం తెలిపారు. విద్యాశాఖలో ప్రభుత్వం అమలు చేసిన సంస్కరణల వల్లే ఈ మార్పు సాధ్యమైందని పేర్కొన్నారు.

**పీవీ, కేకే, జైపాల్‌రెడ్డిని ప్రస్తావించిన సీఎం**

పీవీ నరసింహారావు ప్రారంభించిన సర్వేల్ రెసిడెన్షియల్ స్కూల్స్ దేశానికి ఆదర్శంగా నిలిచాయని సీఎం గుర్తు చేశారు. నవోదయ విద్యాలయాలకు కూడా సర్వేల్ గురుకులమే స్ఫూర్తిగా నిలిచిందన్నారు. తెలంగాణలో తనకు తెలిసిన గొప్ప మేధావులు కే. కేశవరావు (కేకే), జైపాల్‌రెడ్డి మాత్రమేనని పేర్కొంటూ, విద్యా రంగంలో మార్గదర్శకత్వం కోసం కేకేను ప్రత్యేకంగా కోరినట్లు వెల్లడించారు. ఆయన సూచనలతో విద్యా రంగంలో మరిన్ని సంస్కరణలు చేపడుతున్నామని తెలిపారు.

# మంచిర్యాలలో వింత ఘటన

- వర్షంతో పాటు కిందపడ్డ చేపలు.. వైరల్‌గా వీడియో
- చెన్నూరులో భారీ వర్షం వేళ ఆశ్చర్యానికి గురిచేసిన అరుదైన ఘటన
- రోడ్లపై, ఇళ్ల ముందు కనిపించిన చిన్నపాటి చేపలు
- చేపలను ఏరుకునేందుకు పోటీపడ్డ స్థానికులు.
- ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్

**మంచిర్యాల, ప్రజా వాయిస్:** మంచిర్యాల జిల్లా చెన్నూరులో భారీ వర్షం సందర్భంగా చోటుచేసుకున్న ఓ వింత ఘటన స్థానికులను ఆశ్చర్యానికి గురిచేసింది. పట్టణంలోని పుష్పాల హనుమాన్ వీధిలో వర్షపు నీటితో పాటు చిన్నపాటి చేపలు కూడా కిందపడినట్లు స్థానికులు తెలిపారు. రోడ్లపై, ఇళ్ల ముందు చేపలు కనిపించడంతో ఒక్కసారిగా ప్రజలు ఆశ్చర్యానికి గురయ్యారు.

**చేపలను ఏరుకున్న స్థానికులు**

వర్షం అనంతరం రోడ్లపై చేపలు కనిపించడంతో స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని వాటిని ఏరుకున్నారు. ఈ ఘటనను పలువురు తమ సెల్‌ఫోన్లలో చిత్రీకరించగా, ప్రస్తుతం ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

**ఎలా జరిగిందనే దానిపై చర్చ**

భారీ వర్షాలు, బలమైన గాలుల ప్రభావంతో సమీపంలోని చెరువులు లేదా కాలువల నుంచి చేపలు కొట్టుకు వచ్చి ఉండొచ్చని కొందరు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు, కొత్త వరద నీటికి ఎదురీదుతూ వచ్చిన చేపలు నీటి ప్రవాహంతో రోడ్లపైకి చేరి ఉండే అవకాశముందని మరికొందరు చెబుతున్నారు.

**వైరల్‌గా మారిన వీడియో**

ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది. చెన్నూరులో చేపలు కిందపడిన ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అవుతుంది.

# వందేమాతరం బిల్లుపై ఓవైసీ తీవ్ర విమర్శలు

**న్యూఢిల్లీ, ప్రజా వాయిస్:** పార్లమెంట్ ఆమోదించిన వందేమాతరం బిల్లుపై ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. లోక్‌సభ, రాజ్యసభల్లో బిల్లు ఆమోదం పొందిన అనంతరం పార్లమెంట్ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడిన ఆయన, ఈ బిల్లుపై పలు రాజ్యాంగపరమైన అభ్యంతరాలు వ్యక్తం చేశారు.

**'జనగణమనలో ప్రజలు.. వందేమాతరంలో దేవతారాధన"**

జనగణమన' జాతీయ గీతంలో దేశం, ప్రజలు ప్రతిబింబిస్తారని, అయితే 'వందేమాతరం'లో దేవతారాధన అంశం ఉందని ఓవైసీ వ్యాఖ్యానించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను కూడా గుర్తుంచుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

**1950లో అధికారిక తీర్మానం జరగలేదని వ్యాఖ్య**

1950లో అప్పటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ వందేమాతరం అంశంపై అధికారిక తీర్మానం చేయకుండా నిర్ణయం తీసుకోవడం తన అభిప్రాయం ప్రకారం పొరపాటేనని ఓవైసీ పేర్కొన్నారు. జాతీయ గీతానికి సంబంధించి స్పష్టమైన నిర్వచనం కూడా లేదని ఆయన అన్నారు.

**రాజ్యాంగ ఉల్లంఘన ఆరోపణ**

వందేమాతరం బిల్లు ద్వారా కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంలోని 25, 26, 29వ అధికరణల్లో కల్పించిన హక్కులను ఉల్లంఘిస్తోందని ఓవైసీ ఆరోపించారు. ఈ బిల్లుపై తమ అభ్యంతరాలను పార్లమెంట్‌లో కూడా వెల్లడించినట్లు తెలిపారు.



# ప్రయాణికులకు టీజీఎస్‌ఆర్టీసీ గుడ్‌న్యూస్

**హైదరాబాద్, ప్రజా వాయిస్:** ప్రయాణికులకు మరింత మెరుగైన రవాణా అనుభూతిని అందించేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. 'ఫస్ట్ మైల్ టు లాస్ట్ మైల్ కనెక్టివిటీ' పేరుతో ఎలక్ట్రిక్ ఆటో సేవలను అందుబాటులోకి తీసుకురానుంది. ఈ విధానం ద్వారా ప్రయాణికులు బస్ టికెట్ బుక్ చేసుకునే సమయంలోనే ఈ-ఆటో సేవలను కూడా ఒకేసారి బుక్ చేసుకునే సౌకర్యాన్ని కల్పించనుంది.

**బస్ టికెట్‌తోనే ఈ-ఆటో బుకింగ్**

ప్రయాణికుడు ఇంటి నుంచి సమీప బస్ స్టాప్ వరకు, అలాగే బస్సు దిగిన తర్వాత చివరి గమ్యస్థానం వరకు ఈ-ఆటో సేవలను వినియోగించుకునేలా ప్రత్యేక వ్యవస్థను టీజీఎస్‌ఆర్టీసీ రూపొందిస్తోంది. దీంతో ప్రయాణ సమయం ఆదా కావడంతో పాటు రవాణా ఇబ్బందులు కూడా తగ్గనున్నాయి.

**హైదరాబాద్‌లో తొలిదశ అమలు**

ఈ సేవలను తొలుత గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రయోగాత్మకంగా ప్రారంభించనున్నారు. అనంతరం వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్ వంటి ప్రధాన నగరాలకు దశలవారీగా విస్తరించేందుకు టీజీఎస్‌ఆర్టీసీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

**ప్రముఖ కంపెనీలతో సంప్రదింపులు**

ఈ-ఆటో సేవల అమలుకు ప్రముఖ ఎలక్ట్రిక్ ఆటో తయారీ సంస్థలతో టీజీఎస్‌ఆర్టీసీ అధికారులు ఇప్పటికే చర్చలు జరుపుతున్నారు. ఒప్పందాలు ఖరారైన వెంటనే ఈ-ఆటోలను రోడ్లపైకి తీసుకురానున్నారు.

**తక్కువ ఛార్జీలతో సేవలు**

ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఓలా, ఊబర్, ర్యాపిడో వంటి ప్రైవేట్ రైడ్ సేవలతో పోలిస్తే టీజీఎస్‌ఆర్టీసీ ఈ-ఆటోల ఛార్జీలు తక్కువగా ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. దీంతో ప్రజలకు తక్కువ ఖర్చుతో సురక్షితమైన, నమ్మకమైన ప్రయాణ సౌకర్యం అందనుంది.

**శివారు ప్రాంతాలకు పెద్ద ఊరట**

ఎల్బీనగర్, ఉప్పల్, మియాపూర్, పటాన్‌చెరు, రాజేంద్రనగర్, ఘట్‌కేసర్, శామీర్‌పేట్, శంషాబాద్, శేరిలింగంపల్లి వంటి కనెక్టివిటీ తక్కువగా ఉన్న శివారు ప్రాంతాల ప్రజలకు ఈ సేవలు ఎంతో ఉపయోగపడనున్నాయి. ప్రజా రవాణాను మరింత బలోపేతం చేయడంలో టీజీఎస్‌ఆర్టీసీ ఈ నిర్ణయం కీలక మైలురాయిగా నిలవనుందని రవాణా రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితి విషమం

హైదరాబాద్, ప్రజా వాయిస్:నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితి ఇంకా విషమంగానే ఉందని మాజీ మంత్రి హరీష్ రావు వెల్లడించారు. ఈ నెల 26న ఇంట్లో అకస్మాత్తుగా అస్వస్థతకు గురైన ఆయనను తొలుత హనుమకొండలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు అత్యవసర వైద్య చికిత్స కొనసాగుతోందని వైద్యులు తెలిపారు.

**హార్ట్ ఎటాక్ కాదు.. ఊపిరితిత్తుల సమస్యే కారణం**

పెద్ది సుదర్శన్ రెడ్డికి గుండెపోటు రాలేదని, ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్య వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని హరీష్ రావు స్పష్టం చేశారు. గత 20 రోజులుగా హిమోగ్లోబిన్‌కు సంబంధించిన మందులు వాడకపోవడంతో హిమోగ్లోబిన్ శాతం పెరిగి, ఊపిరితిత్తుల నుంచి గుండెకు వెళ్లే వాల్వ్‌లో బ్లాక్ ఏర్పడిందని తెలిపారు. దీని ప్రభావంతో గుండె పనితీరు దెబ్బతిన్నట్లు వివరించారు.

**30–40 నిమిషాలు గుండె పనిచేయలేదు**

అస్వస్థతకు గురైన రోజున సుమారు 30 నుంచి 40 నిమిషాల పాటు గుండె పని చేయకపోవడంతో మెదడుకు ఆక్సిజన్, రక్త సరఫరా నిలిచిపోయిందని హరీష్ రావు వెల్లడించారు. ఈ పరిస్థితి కారణంగా ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి అత్యం త విషమంగా ఉందని పేర్కొన్నారు.

**విదేశీ వైద్య నిపుణులతో సంప్రదింపులు**

పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రాణాలను కాపాడేందుకు హైదరాబాద్, ముంబై, అమెరికా, లండన్‌కు చెందిన ప్రముఖ వైద్య నిపుణులతో సంప్రదింపులు జరుపుతున్నామని హరీష్ రావు తెలిపారు. వైద్య నివేదికలను అమెరికాకు పంపించామని, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు తాను స్వయంగా చికిత్సను పర్యవేక్షిస్తున్నానని చెప్పారు.

**అభిమానులు ఆసుపత్రికి రావద్దు**

ప్రస్తుతం వైద్యులు, కుటుంబ సభ్యులే తదుపరి నిర్ణయాలు తీసుకుంటారని హరీష్ రావు తెలిపారు. అభిమానులు, పార్టీ కార్యకర్తలు ఆసుపత్రి వద్దకు రావద్దని, ఇతరులకు ఇబ్బందులు కలగకుండా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మానవ ప్రయత్నంగా చేయాల్సిన ప్రతి చర్యను వైద్య బృందం చేపడుతోందని ఆయన పేర్కొన్నారు.

# చర్లపల్లి ఫ్యాబ్రికేషన్ కంపెనీలో ఘోర ప్రమాదం

**హైదరాబాద్, ప్రజా వాయిస్:** హైదరాబాద్‌లోని చర్లపల్లి పారిశ్రామికవాడలో ఉన్న సుదర్శన ఇండస్ట్రీస్ ఫ్యాబ్రికేషన్ కంపెనీలో బుధవారం ఘోర పారిశ్రామిక ప్రమాదం చోటుచేసుకుంది. సీఎన్సీ యంత్రంలో ఏర్పడిన సాంకేతిక లోపాన్ని పరిశీలిస్తున్న సమయంలో జరిగిన ప్రమాదంలో సీఎన్సీ ఆపరేటర్ భక్తుని సురేష్ బాబు (42) అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనతో పరిశ్రమలో తీవ్ర విషాదం నెలకొంది.

**యంత్రం పరిశీలిస్తుండగా ప్రమాదం**

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా చెందిన భక్తుని సురేష్ బాబు ఉపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చి చక్రపురిలో నివాసం ఉంటున్నారు. సుమారు 20 రోజుల క్రితమే సుదర్శన ఇండస్ట్రీస్‌లో సీఎన్సీ యంత్ర ఆపరేటర్‌గా చేరారు. బుధవారం మధ్యాహ్నం యంత్రంలో సాంకేతిక లోపం తలెత్తడంతో కంపెనీ మెకానిక్‌తో కలిసి యంత్రాన్ని పరిశీలిస్తున్న సమయంలో ప్రమాదం జరిగింది.

**అక్కడికక్కడే మృతి**

ప్రమాదం తీవ్రత కారణంగా సురేష్ బాబు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనను ప్రత్యక్షంగా చూసిన తోటి కార్మికులు తీవ్ర భయాందోళనకు గురై బయటకు పరుగులు తీశారు. పరిశ్రమలో ఒక్కసారిగా విషాద వాతావరణం నెలకొంది.

**పోలీసుల దర్యాప్తు**

సమాచారం అందుకున్న కుషాయిగూడ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కంపెనీ యాజమాన్యంపై కేసు నమోదు చేసి, పరిశ్రమలో భద్రతా ప్రమాణాలు పాటించారా లేదా అనే కోణంలో దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

**కుటుంబంలో విషాదం**

మృతుడు సురేష్ బాబుకు తల్లి, భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబానికి ఆధారమైన వ్యక్తి ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై పోలీసులు, సంబంధిత అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు.

# తుపాకీ మౌనమైంది... ప్లకార్డు గర్జిస్తోంది

ప్రజల అసంతృప్తి పెరిగితే మరో జంతర్‌మంతర్ ఎక్కడైనా పుడుతుంది. అది ఒక నగరంలో కాదు ప్రతి ఊరిలో, ప్రతి కళాశాలలో, ప్రతి ఇంట్లో, ప్రతి మొబైల్ ఫోన్‌లో కూడా రూపం దాల్చే పరిస్థితి ఏర్పడుతుందని పరిశీలకులు చెబుతున్నారు. ప్రజాస్వామ్యంలో రాజ్యాంగం కల్పించిన హక్కులతో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజలను బలంతో ఎదుర్కోవడం కంటే, వారి సమస్యలను వినడం, పరిష్కరించడం ప్రభుత్వాల అసలు బాధ్యతగా పేర్కొంటున్నారు.అణచివేత తాత్కాలిక నిశ్శబ్దాన్ని తీసుకురాగలదేమో గానీ, ప్రజల ఆవేదనకు శాశ్వత పరిష్కారం కాదని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.మావోయిజం అంతమైంది అనే ప్రకటనలపై కూడా చర్చ సాగుతోంది. సాయుధ ఉద్యమం బలహీనపడి ఉండొచ్చు. కానీ అన్యాయం నుంచి పుట్టే అసంతృప్తి అంతమైందా.? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. తుపాకీ స్థానంలో ప్లకార్డు, అడవి స్థానంలో ప్రజాస్వామ్య వేదికలు వచ్చినా, ప్రశ్నించే స్వరం మాత్రం కొనసాగుతూనే ఉంటుందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.చివరికి ప్రజాస్వామ్యంలో గెలిచేది తుపాకీ కాదు... ప్రజల విశ్వాసం. నిలిచేది భయం కాదు... ప్రజల తీర్పే.

# తెలంగాణ జలాశయాలకు కొనసాగుతున్న వరద ప్రవాహం

**మొదటి పేజీ తరువాయి**

అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు.

**శ్రీశైలం, సాగర్‌లో సాధారణ ప్రవాహం**

జూరాల నుంచి విడుదలైన నీటితో శ్రీశైలం జలాశయానికి 27,210 నుంచి 35,913 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. అయితే ప్రస్తుతం స్పిల్‌వే గేట్లు ఎత్తకుండా తాగునీటి అవసరాలు, కాలువల కోసం మాత్రమే సుమారు 1,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఇక నాగార్జునసాగర్‌కు ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో రెండూ 900 నుంచి 5,647 క్యూసెక్కుల మధ్య సాధారణ స్థాయిలో కొనసాగుతున్నాయి.

**భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి**

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల ప్రభావంతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం నీటిమట్టం 27 అడుగులకు చేరగా, గంటగంటకూ వరద ప్రవాహం పెరుగుతోందని అధికారులు తెలిపారు.

**ఎల్లంపల్లిలో భారీ ఇన్‌ఫ్లో**

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి నిల్వ సామర్థ్యం 20 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 13.93 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పూర్తి నీటిమట్టం 148 మీటర్లు కాగా, ప్రస్తుతం 145.58 మీటర్ల వద్ద ఉంది. ప్రాజెక్టులోకి 78,034 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 16,025 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

**నిజాంసాగర్, సింగూరుకు వరద నీరు**

నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 3,935 క్యూసెక్కుల వరదనీరు చేరుతోంది. పూర్తి నీటిమట్టం 1405 అడుగులు కాగా, ప్రస్తుతం 1395.8 అడుగుల వద్ద ఉంది. ప్రాజెక్టులో 7.46 టీఎంసీల నీరు నిల్వ ఉంది. సింగూరు జలాశయానికి కూడా వరద ప్రవాహం కొనసాగుతోంది.

**గడ్డెన్న వాగు ప్రాజెక్టులోకి 4,500 క్యూసెక్కులు**

నిర్మల్ జిల్లా భైంసాలోని గడ్డెన్న వాగు ప్రాజెక్టులోకి 4,500 క్యూసెక్కుల వరదనీరు చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 358.70 మీటర్లు కాగా, ప్రస్తుతం 355.8 మీటర్ల వద్ద నీటి నిల్వ నమోదైంది. అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నారు.





## వర్షాల వేళ అప్రమత్తంగా ఉండాలి

- **అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్**

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ సూచించారు. గురువారం రాజూర్ సమీపం లోని వాగు కాజ్‌వేను పరిశీలించిన .. నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న సమయంలో ప్రజలు, వాహనదారులు కాజ్‌వేలు, వాగులు, కల్వర్టులు దాటేందుకు ప్రయత్నించవద్దని హెచ్చరించారు. ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలను నియంత్రించాలని అధికారులను ఆదేశించారు. వర్షాల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజల భద్రతకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు.



## ప్రమాదకరంగా రహదారి- వెంటనే మరమ్మతు చేయాలి

- **నవాబుపేట బిజెపి ప్రధాన కార్యదర్శి కార్యదర్శి పత్తేపురం ప్రభాకర్ రెడ్డి**

(ప్రజావాయిస్ నవాబుపేట్): నవాబుపేట్ మండలంలోని ప్రధాన రహదారి భారీ గుంతలతో ప్రమాదకరంగా మారిందని భారతీయ జనతా పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పత్తేపురం ప్రభాకర్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు.ఇటీవల కురిసిన వర్షాల కారణంగా రహదారిపై ఉన్న గుంతల్లో నీరు నిల్వ ఉండటంతో అవి వాహనదారులకు కనిపించకుండా పోతున్నాయని తెలిపారు. దీంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈరోజు కూడా ఒక స్కూటర్, ఒక మోటారు సైకిల్ గుంతల్లో పడిపోయి ఇద్దరు వాహనదారులు గాయపడినట్లు తెలిపారు.ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ రహదారిని సంబంధిత అధికారులు వెంటనే మరమ్మతు చేసి ప్రజలకు సురక్షిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సమస్య పరిష్కారం కోసం గతంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకోలు, ధర్నాలు, పాదయాత్రలు నిర్వహించడంతో పాటు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఫలితం కనిపించలేదని అన్నారు. అలాగే సామాజిక మాధ్యమాల ద్వారా కూడా ప్రజల దృష్టికి సమస్యను తీసుకెళ్లే ప్రయత్నాలు చేసినప్పటికీ అధికారులు స్పందించలేదని విమర్శించారు.ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యాన్ని వీడి వెంటనే చర్యలు చేపట్టి నవాబుపేట్ మండల ప్రజల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.





## ఇది చెరువు కాదు... మంథని బస్టాండ్!

- **ఒకవైపు సుందరీకరణ ముచ్చట.. మరోవైపు బస్టాండ్‌లో ప్రయాణికుల నరకయాతన**
- **ఐటీ మంత్రి శ్రీధర్ బాబు నియోజకవర్గంలోనే ఈ దుస్థితా?**

**ప్రజా వాయిస్ మంథని**"అది చెరువు కాదు... మీరు నిలబడింది మంథని ఆర్టీసీ బస్టాండ్‌లోనే!" – ప్రస్తుతం మంథని బస్టాండ్ పరిస్థితిని చూస్తే స్థానికులు, ప్రయాణికులు అంటున్న మాట ఇది.స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మంథని నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దేందుకు, పట్టణ సుందరీకరణకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తూ నిధులు కేటాయిస్తున్నారు. పట్టణాన్ని అందంగా తీర్చిదిద్దడం శుభపరిణామమే అయినప్పటికీ... నిత్యం వేలాది మంది ప్రయాణించే ప్రధాన బస్టాండ్‌ను మాత్రం అధికారులు పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.కొద్దిపాటి వర్షం పడినా చాలు, బస్టాండ్ ప్రాంగణం మొత్తం జలమయమై ఒక చిన్నపాటి చెరువును తలపిస్తోంది. సరియైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు బయటకు వెళ్లే దారి లేక బస్టాండ్‌లోనే నిలిచిపోతోంది. వ్యాధుల భయం: రోజులు గడుస్తున్నా నీరు నిల్వ ఉండటంతో దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు తీవ్రంగా పెరిగిపోయి అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

**సుందరీకరణలో బస్టాండ్‌కూ చోటివ్వండి:**

పట్టణ సుందరీకరణ అంటే కేవలం వీధులు, కూడళ్ల ప్రాజెక్టులు మాత్రమే కాదని... ప్రజావసరాలతో ముడిపడి ఉన్న ఆర్టీసీ బస్టాండ్ వంటి ప్రాంతాలను ఆధునీకరించడమే అసలైన సుందరీకరణ అని ప్రజలు పేర్కొంటున్నారు. మంత్రి శ్రీధర్ బాబు వెంటనే స్పందించి, సుందరీకరణ ప్రణాళికలో మంథని బస్టాండ్ పునరుద్ధరణను కూడా చేర్చి, డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని స్థానిక ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

# విజృంభిస్తున్న ఇసుక మాఫియా!

- **కళ్లముందే కోట్ల రూపాయల ఇసుక అక్రమ దందా!**
- **అధికారుల మౌనం.. దళారుల రాజ్యం**
- **పేపర్లకే పరిమితమైన చట్టాలు... అమలు శూన్యం**



**ప్రజా వాయిస్, హుజూర్‌నగర్**, july 30సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణా రోజురోజుకూ సరిహద్దులు దాటుతోంది. అక్రమార్కులు యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నా నిరోధించాల్సిన అధికారులు నిద్రమత్తు వీడడం లేదనే విమర్శలు తీవ్రస్థాయిలో వ్యక్తమవుతున్నాయి.

**వాల్టా చట్టానికి నీళ్లు... పాతాళానికి భూగర్భ జలాలు**

లింగగిరి గ్రామ శివారులోని వేములూరి వాగును ప్రధాన లక్ష్యంగా చేసుకుని ఇసుక దళారులు రాజ్యమేలుతున్నారు. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు, మైనింగ్ పర్మిట్లు లేకుండానే నెంబర్ ప్లేట్ లేని ట్రాక్టర్లతో నిత్యం టన్నుల కొద్దీ ఇసుకను తరలిస్తున్నారు. భూగర్భ జలాలను పరిరక్షించేందుకు ఉద్దేశించిన 'వాల్టా' చట్టాన్ని బహిరంగంగా ఉల్లంఘిస్తూ వాగుల ఆకారాన్ని పూర్తిగా మార్చేస్తున్నారు. పరిమితికి మించి ఇసుక తోడేస్తుండటంతో చుట్టుపక్కల వ్యవసాయ బావుల్లో నీటిమట్టం పాతాళానికి పడిపోతోందని, పర్యావరణ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింటోందని స్థానిక రైతులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**శాఖల 'సమన్వయ' లోపమా?... మామూళ్ల మాయాజాలమా?**

కళ్లముందే వందలాది ఇసుక ట్రాక్టర్లు తిరుగుతున్నా మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు పట్టించుకోకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చట్టవిరుద్ధంగా ఇసుక రవాణా చేసే వాహనాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం, భారీగా జరిమానాలు విధించడం, వాహనాలను సీజ్ చేయడం వంటి కఠిన చర్యలకు చట్టంలో అవకాశముంది. క్షేత్రస్థాయికి వచ్చేసరికి ఈ నిబంధనలన్నీ కాగితాలకే పరిమితమవుతున్నాయి. హెచ్చరికలు జారీ చేయడం తప్ప ఇసుక మాఫియాపై ఎందుకనో కఠినంగా వ్యవహరించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**స్పందించకపోతే ఉద్రిక్తత తప్పదు**

లింగగిరి వేములూరి వాగు నుంచి జరుగుతున్న ఈ అక్రమ దోపిడీని తక్షణమే అడ్డుకోకపోతే వాగును నమ్ముకున్న అనేక గ్రామాలు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇకనైనా జిల్లా కలెక్టర్ మరియు ఇతర ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకుని వేములూరి వాగు పరివాహక ప్రాంతంలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలతో తనిఖీలు చేపట్టాలని, ఇసుక దళారులతో పాటు వారికి సహకరిస్తున్న వారిపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.



## ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని సందర్శించిన జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్

**నల్గొండ క్రైమ్/ ప్రజా వాయిస్:** అనుముల మండలం యాచారం గ్రామంలో గల ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని నల్లగొండ జిల్లా కలెక్టర్ సందర్శించడం జరిగింది. ఈ సందర్శన లో భాగంగా ఇక్కడ జరుగుతున్నటువంటి ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ కంపెనీ యొక్క నిర్మాణ పనులను సమీక్షించడం జరిగింది ముఖ్యంగా ఈ సంవత్సరం డిసెంబర్ లోపు రైతులకు అందుబాటులోకి తీసుకుని రావాలని కంపెనీ ప్రతినిధులకు జిల్లా కలెక్టర్ సూచించడం జరిగింది అదేవిధంగా ఉద్యాన శాఖ తరపున ఇచ్చినటువంటి పథకాలను రైతులు ఉద్యాన సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రైతులను కోరడం జరిగింది. అదేవిధంగా ఆయిల్ ఫామ్ లక్ష్యాలను ఈ సంవత్సరంలోపు సాధించేసి మరింత అడిషనల్ టార్గెట్ ను కూడా తీసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన & పట్టు పరిశ్రమ అధికారి శేఖర్, జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్, హాలియా సహాయ వ్యవసాయ అధికారి సరిత , Dr. రాములమ్మ కంపసాగర్ కె వి కె శాస్త్రవేత్త , స్థానిక అనుముల క్లస్టర్ హార్టికల్చర్ ఆఫీసర్ మురళి, ఇతర ఉద్యాన అధికారులు ప్రవీణ్ కుమార్, అనంత రెడ్డి, శ్వేత, నసీమా , రిషిత, రవి నాయక్ , విద్యాసాగర్, పతంజలి కంపెనీ డీజీఎం యాదగిరి, యాచారం గ్రామ సర్పంచి కుందూరు స్వాతి, కొత్తలూరు గ్రామ సర్పంచి రాంబాబు, సిద్ధార్థ రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు చుట్టుపక్క గ్రామాల రైతులు, హెచ్ ఈ ఓ లు, ఏవోలు ఏఈవోలు రైతులు కంపెనీ వారు తదితరులు పాల్గొన్నారు....

## కార్మికుల ఇళ్లలోకి డ్రైనేజీ నీరు

- **సింగరేణి యాజమాన్యం తక్షణమే శాశ్వత పరిష్కారం చూపాలి**
- **సీఐటీయు డిమాండ్**

**ప్రజా వాయిస్** 8వ కాలనీఎడతెరిపి లేని వర్షాలకు రామగుండం–2 ఏరియాలోని 8వ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా ధ్వంసమై కార్మికుల క్వార్టర్లలోకి మురుగునీరు చేరుతోందని, సింగరేణి యాజమాన్యం తక్షణమే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని సీఐటీయూ ఆర్జి–2 ఏరియా కార్యదర్శి కుంట ప్రవీణ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.గత సంవత్సర కాలంలో పలుమార్లు స్థానిక సమస్యలపై స్పందిస్తూ సీఐటీయూ బ్రాంచ్ నాయకుల ఆధ్వర్యంలో 'బస్తీ బాట' నిర్వహిస్తూ కాలనీ సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని గుర్తుచేశారు, దశాబ్దాల నాటి పాత డ్రైనేజీ వ్యవస్థ నీటి ప్రవాహాన్ని తట్టుకోలేకపోవడంతో పాటు, వర్షపు నీటికి ప్రత్యేక కాలువలు లేకపోవడంతో డ్రైనేజీ నీరు, వర్షపు నీరు కలిసి ఇళ్లలోకి ప్రవహిస్తున్నాయని, క్వార్టర్లలోకి మురుగునీరు చేరి బియ్యం, నిత్యావసర సరుకులు, గృహోపకరణాలు పాడై కార్మిక కుటుంబాలు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే క్వార్టర్ల రూఫ్‌లు లీక్ అయి పెచ్చులు ఊడిపడుతున్నా సివిల్ డిపార్ట్‌మెంట్ పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కాలనీ సమస్యలపై ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా సివిల్ అధికారులు అస్సలు పట్టించుకోవడం లేదని ముఖ్యంగా T2- 46 & T2-1517 నుండి T2-1521 వరకు మరియు ST2-2565 & ST2-1474 నుండి 1476 వరకు చాలా అధ్వానమైన పరిస్థితిలో సింగరేణి కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్రహానికి గురవుతున్నారని, ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి 8వ కాలనీలో నూతన డ్రైనేజీ వ్యవస్థను, వర్షపు నీటి కాలువలను వెంటనే నిర్మించాలని, క్వార్టర్ల రూఫ్‌ల లీకేజీలను అరికట్టి నాణ్యమైన షీట్లు ఏర్పాటు చేయాలని, అలాగే నష్టపోయిన కార్మిక కుటుంబాలకు తగిన న్యాయం చేయాలని కోరారు. యాజమాన్యం తక్షణమే స్పందించి 8 ఇంక్లైన్ కాలనీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపకపోతే కార్మికులను సమీకరించి ఆందోళనను తీవ్రతరం చేస్తామని సీఐటీయూ గా హెచ్చరించారు.



## భారీ వర్షాల నేపథ్యంలో మున్సిపల్ అప్రమత్తం

- **పలు వార్డుల్లో పారిశుద్ధ్య చర్యలు.**

**ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :** గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో గురువారం పురపాలక సంఘం అప్రమత్తమైంది. పట్టణ పరిధిలోని 1వ, 4వ, 7వ, 15వ వార్డుల్లో నీరు నిల్వ ఉండకుండా జేసీబీ, పారిశుద్ధ్య సిబ్బందితో కాలువలు, రహదారులను శుభ్రం చేయించి వరద నీటి తొలగింపు చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా ప్రజలు వర్షాల సమయంలో అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే మున్సిపల్ అధికారులకు సమాచారం అందించాలని అధికారులు సూచించారు. అలాగే శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివాసం ఉండకుండా, సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బిరుదు రాధాకృష్ణ, కౌన్సిలర్లు వరప్రదీప్ ఊట్ల, ఈర్ల స్వరూప, గాదాసు మంజుల, మున్సిపల్ కమిషనర్ టి. రమేష్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## వాగులు దాటొద్దు.. ప్రజలకు కలెక్టర్ హరిత హెచ్చరిక

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని జిల్లా కలెక్టర్ కె. హరిత తెలిపారు. ఆసిఫాబాద్ మండలంలోని గుండి వాగు, అలూరి సమీపంలోని వరద ప్రవాహాన్ని పరిశీలించిన ఆమె.. ప్రజలు, రైతులు, పశువుల కాపరులు ఎట్టి పరిస్థితుల్లోనూ వాగులు దాటే ప్రయత్నం చేయవద్దని హెచ్చరించారు. ప్రమాదకర ప్రాంతాల్లో రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీసు సిబ్బందిని మోహరించి ఎవరినీ దాటనివ్వొద్దని అధికారులకు ఆదేశించారు. అత్యవసర సహాయం కోసం కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ 8500844365ను సంప్రదించాలని సూచించారు.



## హనుమకొండ బస్టాండ్ "ఎర్టిగా" వాహనాలతో జంక్షన్ జామ్

**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి** హనుమకొండ జిల్లా కేంద్రంలోనిబస్టాండ్ వద్ద మూలమలుపులో విచ్చలవిడిగా రోడ్డు పైనే నిలుపుతున్న ప్రైవేట్ టాక్సీలుహనుమకొండ టు ఉప్పల్ ప్రయాణికుల కోసం ఎర్టిగా కార్లు నిలపడం తో తరచూ ట్రాఫిక్ జామ్ అవుతున్నాయి.ప్రైవేట్ టాక్సీ వాహనాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు, స్థానిక వ్యాపారస్తులు. వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్న పట్టించుకోని సంబంధిత అధికారులుకార్లు సగం పైనే రోడ్డును ఆక్రమించడంతో ప్రైవేట్ ఆసుపత్రులు బస్టాండు చౌరస్తా వద్ద ఎక్కువగా ఉండడంతో వాహనదారులు వెళ్లడానికి రోగులకు తప్పని తిప్పలు ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు. ముడుపులకు ఆశపడకుండా? విధులను సక్రమంగా చేయాలని వేడుకుంటున్న ప్రజలు.ఇప్పటికైనా జిల్లా పోలీస్ కమిషనర్ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా. స్పందించాలని వాహనదారులు వేడుకుంటున్నారు.





# 'దోస్త్' విద్యార్థులకు వసతి భరోసా

- **జిల్లా కలెక్టర్ కె. హైమావతి**
- **దోస్త్ ద్వారా గజ్వేల్, సిద్దిపేట డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు వసతి సౌకర్యం**
- **గజ్వేల్ విద్యా కేంద్రం, సిద్దిపేట కార్యనిరత మహిళల వసతి గృహం పరిశీలన**
- **ఇంజనీరింగ్ అధికారులకు మరమ్మతులు, ఏర్పాట్లకు ఆదేశాలు**

**ప్రజా వాయిస్, గజ్వేల్ :** దోస్త్ (డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ – తెలంగాణ) ద్వారా సిద్దిపేట, గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ప్రభుత్వం తరపున వసతి సౌకర్యం కల్పిస్తామని, ఏ ఒక్క విద్యార్థి కూడా కళాశాల మార్చుకోవాల్సిన అవసరం లేదు అని జిల్లా కలెక్టర్ కె. హైమావతి తెలిపారు. గురువారం గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థుల కోసం విద్యా కేంద్రం, సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థుల కోసం సఖి కేంద్రం వెనుక కార్యనిరత మహిళల వసతి గృహాన్ని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... నిరుపేద విద్యార్థులు ప్రైవేట్ గదులు తీసుకుని చదువుకునే స్తోమత లేని వారికి ప్రభుత్వం తరపున వసతి సౌకర్యం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. గజ్వేల్ విద్యా కేంద్రం వెనుక ఉన్న భవనాలను వసతి గృహం కోసం సిద్ధం చేయాలని, ఎస్సీ సంక్షేమ వసతి గృహంలో కొన్ని గదులు కేటాయించి పడకలు, స్నానాల గది, వంటగది నిర్మించాలని ఈడబ్ల్యూఐడిసి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సిద్దిపేట మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థుల కోసం కార్యనిరత మహిళల వసతి గృహం కేటాయించాలని, చిన్న మరమ్మతులు పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులు, ఒప్పందదారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ సఖి కేంద్రాన్ని సందర్శించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ చంద్రకళ, గజ్వేల్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనిత, ఈడబ్ల్యూఐడిసి ఈఈ శ్రీనివాస్ రెడ్డి, డీడబ్ల్యూఓ శారద, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మా మంత్రి నియోజకవర్గం లో రోడ్ల పరిస్థితి

- **బీటీ రోడ్డు నిర్మాణం కోసము 33 కోట్లు మంజూరు చేసిన నిధులు ఎక్కడ..?**
- **పేరుకే మంత్రి రోడ్లన్నీ అధ్వానం**
- **గత పాలకవర్గంలో మునుపల్లి,జెడ్పిటిసి ఎంపిపి చేసిన వ్యాఖ్యలు సభ్యసభజానికి అవమానకరం అయినా మంత్రికి సోయలేదు**

**ప్రజా వాయిస్ సంగారెడ్డి :** రహదారుల మరుమతుల కోసం నియోజకవర్గంలో 33 కోట్ల వ్యయంతో బీటీ రోడ్ నిర్మాణ కోసం నిధులు మంజూరు చేసినట్లు గొప్పలు చెప్పుకున్న మంత్రి ( అధికారికంగా నిధులు మంజూరు చేసిన జీవో కాపీని ) పార్టీ అనుచరుల ద్వారా సోషల్ మీడియాలో హల్చల్ చేశారు. ఆయన మంజూరు చేసినట్లు పేర్కొన్న రోడ్లు గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే శంకుస్థాపన చేసి మనుమతి పనులు ప్రారంభించారు. కానీ అంతులేని ప్రభుత్వం మారింది ఏం జరిగిందని చెప్పలేము కానీ... గ్రామీణ ప్రాంతాల రోడ్లకు ప్రాధాన్య ఇస్తూ బీటీ రోడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తానని చెప్పి 33 కోట్లు నియోజకవర్గానికి కేటాయిస్తున్నట్లు ప్రకటించడం హాస్య స్పదంగాఉంది. విచిత్రమైనటువంటి ఈ రోడ్ల నిర్మాణం కోసం గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రభుత్వంలోని నాటి ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ నిర్మాణం శంకుస్థాపన చేశారు. అది మర్చి తాను ఎక్కడ చేస్తే ఇబ్బంది అవుతుందో అన్న ఉద్దేశంతో మంత్రి ఆదేశాల మేరకు మండల నాయకులే రోడ్ల మన్మధుల కోసం శంకుస్థాపన చేసుకోవాలని సూచించడంతో సంగుపేట నుంచి పోచారం, పోచారం నుంచి పోతిరే పల్లి మీదుగా లక్ష్మీ సాగర్. మునిపల్లి నుంచి బుసరెడ్డిపల్లి సింగర్ ప్రాజెక్ట్ వరకు బీట్ రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయడంతో ఆయా పార్టీ మండలాల అధ్యక్షులతో కొబ్బరికాయలు కొట్టి శంకు స్థాపన చేశారు. కానీ గత బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్మాణం కోసం నిధులు మంజూరు అయ్యాయి. రాజకీయ ఉద్దేశాల పూర్వకంగానే పనులు ఆపేందుకు కాంట్రాక్టర్ పై ఒత్తిడి తీసుకువచ్చి పనులు నిలిపివేశారు అని ఆరోపణలు ఉన్నాయి. గత రెండున్నర ఏండ్లుగా ఏక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. బీ ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో ఉండగానే పనులు ప్రారంభించారు. డబ్బులేయార్ కంకరతో రోడ్డు చేయడంతో పాటు జంగల్ కటింగ్ సైతం చేశారు. తాజాగా అంతకు రెండింతలు మరమ్మతూ పనులు రెండు వింతలుగా పెంచి తిరిగి టెండర్లు వేశారు. దాని ఫలితంగానే వస్తా పార్టీ మండల అధ్యక్షులు మేమే ప్రాంతాలకు రోడ్ల నిర్మాణ కోసం నిధులు మంజూరు చేసాం మీరే ప్రారంభించుకోండి అని పరోక్షంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించడంతో ఆయా పార్టీల మండల అధ్యక్షులు పనులు ప్రారంభించారు. రోడ్ల భవనాల శాఖ నిబంధన ప్రకారం తిరిగి టెండర్లు ఆహ్వానించాల్సి ఉంటుంది. కానీ మంత్రి మనవాడే కదా అనుకున్నారేమో కాంటాక్ట్లను.. ఆయన చెప్పిన విధంగానే ఎప్పటిలాగే మండల అధ్యక్షులతో మాట్లాడి మంత్రి చెప్పాడు ప్రయాణించమన్నాడు.. అంటూ పండ్లు ఇలాంటి ప్రభుత్వ ఉత్తర్వులు లేకుండానే పనులు ప్రారంభించారు. ఇప్పటివరకు ఈ ఇద్దరు అయినా రెండు నెలలు జరిగినప్పటికీ నియోజకవర్గంలోని తొమ్మిది మండలాల్లో ఏ ఒక్క ప్రాంతంలో కూడా పూర్తిస్థాయిలో పనులు జరగలేదు. అంటే మంత్రి కేవలం తన మెప్పుకోసం కాంట్రాక్టర్లను పనిచేయించి వారి నుంచి కమిషన్ దండుకోవడం కోసమే పని చేయిస్తున్నారని ఆరోపణ ప్రధానం.. అది వాస్తవమా కాదా అనేది సొంత పార్టీ నేతలకే తెలవాలి కాంట్రాక్టర్లకు కూడా..?





# ఆకర్షణలకు లోనై మోసపోవద్దు

- **విద్యార్థులు లక్ష్య సాధనకు శ్రమించాలి**
- **.ఇంచార్జ్ జిల్లా సంక్షేమ అధికారి శిరీష**

**ప్రజా వాయిస్/మహబూబాబాద్,**యుక్త వయస్సులో భావోద్వేగాలను నియంత్రించుకొని, విద్యార్థులు విద్యపై దృష్టి పెట్టి జీవిత లక్ష్యాలను సాదించాలని ఇంచార్జ్ జిల్లా సంక్షేమ అధికారి శిరీష అన్నారు. జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఇంచార్జ్ జిల్లా సంక్షేమ అధికారి శిరీష అధ్యక్షతన ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి మాట్లాడుతూ, నేటి సమాజంలో పిల్లలు, మహిళలు తెలియకుండానే మానవ అక్రమ రవాణా బారిన పడుతున్నారని తెలిపారు. అపరిచితుల మాటలను నమ్మకూడదని, ఉద్యోగం, డబ్బు, బహుమతులు లేదా ఇతర ఆకర్షణీయమైన వాగ్దానాలకు మోసపోవద్దని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు తమ దృష్టిని చదువుపైనే కేంద్రీకరించి, తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం షీ టీం ఎస్.ఐ సునంద మాట్లాడుతూ, యుక్తవయస్సులో కలిగే ఆకర్షణలు, సామాజిక మాధ్యమాల ప్రభావం మరియు తప్పుడు పరిచయాల కారణంగా కొంతమంది పిల్లలు ఇంటి నుండి వెళ్లిపోవడం జరిగి, అనంతరం మానవ అక్రమ రవాణాకు గురయ్యే ప్రమాదం ఉందని వివరించారు. యుక్త వయస్సులో భావోద్వేగాలను నియంత్రించుకొని, విద్యపై దృష్టి పెట్టి జీవిత లక్ష్యాలను సాధించాలని సూచించారు.అనంతరం డీల్సా ప్రతినిధి, AHTU సిబ్బంది మరియు జీసీడీఓ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా నివారణ, బాలల రక్షణ, తల్లిదండ్రులు మరియు విద్యార్థుల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ సందర్భంగా మానవ అక్రమ రవాణా నివారణకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి, ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జీసీడీఓ గాయత్రి గారు, జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి రవి రథోడ్ (డి ఎం హెచ్ ఓ ) , డీల్సా అస్ట్ లీగల్ అడ్ డిఫెన్స్ కౌన్సిలర్ ) అడ్వకేట్ రాజు కృష్ణ (, షీ టీం ఎస్ ఐ సునంద మహిళా సాధికారత సిబ్బంది, సఖి సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ఘమ్మక్స్ , మరియు షేర్ ప్రతినిధులు, జిల్లా బాలల పరిరక్షణ సిబ్బంది, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఐసీడ్ స్ సీడీపీఓస్ , ఏసీడీపీఓ సూపెర్వైసోర్స్ అంగన్వాడీ సభ్యులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.




# సేవలకు ఘన గౌరవం..
# పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులకు సన్మానం

- **నిబద్ధతతో సేవలందించిన ముగ్గురు అధికారులకు శాలువా,జ్ఞాపికలతో సత్కారం**
- **పదవీ విరమణ ఉద్యోగానికి ముగింపు మాత్రమే.. జీవితానికి కొత్త అధ్యాయం**
- **ఎస్పీ శరత్ చంద్ర పవార్యువ పోలీసు సిబ్బందికి ఆదర్శంగా నిలిచిన అధికారులు — ప్రశంసలు**

**ప్రజా వాయిస్,నల్గొండ.** నల్గొండ జిల్లా పోలీసు శాఖలో సుదీర్ఘకాలం పాటు క్రమశిక్షణ, నిజాయితీ, అంకితభావంతో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ ఘనంగా సన్మానం చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఎస్.ఐ. ఎన్. ప్రభాకర్, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ బి. మోహన్‌రావు, హెడ్ కానిస్టేబుల్ ఎం.డి. హిదాయత్ అలీలకు శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి, పుష్పగుచ్ఛాలతో సత్కరించి వారి సేవలను కొనియాడారు.ఈ సందర్భంగా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం కేవలం ఉపాధి మాత్రమే కాకుండా ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు అంకితమైన బాధ్యతాయుతమైన సేవ అని అన్నారు. ఎన్నో సవాళ్లను అధిగమిస్తూ ప్రజలకు సేవలందించిన పదవీ విరమణ పొందిన అధికారులు యువ పోలీసు సిబ్బందికి ఆదర్శప్రాయులని పేర్కొన్నారు.పదవీ విరమణ ఉద్యోగ జీవితానికి ముగింపు మాత్రమేనని, వ్యక్తిగత జీవితంలో కొత్త అధ్యాయానికి నాంది అని ఎస్పీ అన్నారు. ఇకపై కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆరోగ్యంగా గడుపుతూ తమ అనుభవాలను సమాజానికి పంచాలని ఆకాంక్షించారు. పోలీసు శాఖతో వారి అనుబంధం ఎప్పటికీ కొనసాగుతుందని, శాఖ తరపున అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన అధికారులు తమ సేవా కాలంలో సహకరించిన ఉన్నతాధికారులు, సహచర పోలీసు సిబ్బంది, కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్, ఏఓ శివ ప్రసాద్, ఆర్ఐ సంతోష్, ఆర్ఎస్ఐ జంగయ్య, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు జయరాజు, పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది, పదవీ విరమణ పొందిన అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఈస్‌గావ్ ఎస్సీ కాలనీలో నాలా, రోడ్డు సమస్యలు తక్షణ చర్యలు చేపట్టాలని స్థానికుల డిమాండ్

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం ఈస్‌గావ్ ఎస్సీ కాలనీలో ప్రజా సమస్యలు తీవ్రరూపం దాల్చాయి. సరైన నాళా నిర్మాణం లేకపోవడం, ఇటుకల రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో స్వల్ప వర్షానికే మురుగునీరు, వర్షపు నీరు రహదారిపై నిలిచిపోతోంది. దీంతో కాలనీవాసుల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది.వర్షపు నీరు రోడ్డుపై నదిలా ప్రవహిస్తుండటంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని నడవాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వృద్ధులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ప్రమాదాల బారిన పడుతున్నారు. రాకపోకలు సాగించలేని దుస్థితితో నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీవాసులు వాపోతున్నారు.కాలనీలో డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని, దెబ్బతిన్న రోడ్డుకు తక్షణమే మరమ్మతులు చేయాలని అధికారులను, ప్రజాప్రతినిధులను స్థానికులు కోరుతున్నారు.



# వర్షాకాల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- **జిల్లా వైద్యాధికారి ఘనేశ్వర్**
- **శంకరంపేట పీహెచ్‌సీ, కేజీబీవీ హాస్టల్, ప్రైవేట్ ఆస్పత్రిని తనిఖీ**
- **పరిశుభ్రత, ఆహార నాణ్యతపై ప్రత్యేక దృష్టి..**

**ప్రజా వాయిస్, పెద్ద శంకరంపేట:** వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల వ్యాప్తిని సమర్థవంతంగా అరికట్టేందుకు ఆరోగ్య శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను మరింత ముమ్మరం చేస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లా వైద్య & ఆరోగ్య అధికారి డా. ఘనేశ్వర్, జిల్లా ఉప వైద్య & ఆరోగ్య అధికారి డా. హరిప్రసాద్, ప్రోగ్రామ్ అధికారి డా. నవ్య, జిల్లా మలేరియా అధికారి చందర్ గురువారం పెద్ద శంకరంపేట(ఏ) ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఆస్పత్రిలోని ప్రతి విభాగాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన అధికారులు, రోగులకు అందుతున్న వైద్య సేవలు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు, సీజనల్ వ్యాధుల నివారణ చర్యలు, ఔషధాల నిల్వలు, రిజిస్టర్లు, రికార్డులు, నివేదికలను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో డెంగీ, మలేరియా, వైరల్ జ్వరాలు, ఇతర అంటువ్యాధుల నివారణకు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా పనిచేయాలని, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.అనంతరం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) హాస్టల్‌ను సందర్శించిన అధికారులు వంటగది, స్టోర్‌రూమ్, పరిశుభ్రతను పరిశీలించారు. విద్యార్థినులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించడంతో పాటు హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సంబంధిత అధికారులకు సూచించారు.తదుపరి మండలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిని సందర్శించి వైద్య సేవల నిర్వహణ, రికార్డులు, నిబంధనల అమలును పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా ప్రతి వైద్య సంస్థ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.ఈ తనిఖీల్లో పీహెచ్‌సీ వైద్యాధికారి డా. షర్ఫుద్దీన్, హెల్త్ ఎడ్యుకేటర్ కె. యాదయ్య, హెల్త్ అసిస్టెంట్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.





# మా వార్డు పట్ల ఎందుకు ఇంతా కక్ష సాధింపు

- **చైర్మన్ పీఠం కోసం మమ్మల్ని పావుల వాడుకున్నారు..**
- **మేము ఏం పాపం చేశాం..**
- **కాంగ్రెస్ మున్సిపల్ చైర్మన్ పై నిప్పులు చెరిగిన ఎంఐఎం కౌన్సిలర్ భర్త..**
- **మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసిన 8 వ వార్డు కౌన్సిలర్ భర్త..**
- **ఎంఐఎం నుంచి గెలిచి కాంగ్రెస్ కు మద్దతు తెలిపినందుకు మాకు ప్రాయశ్చిత్తపు శిక్ష అంటూ వెల్లబేసుకుంటూ ఆవేదన..**




**ప్రజా వాయిస్ జహీరాబాద్:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ చైర్మన్, కమిషనర్ నియంతృత్వ, నిర్లక్ష్య వైఖరికి నిరసనగా మున్సిపల్ కార్యాలయం ఎదుట ఒక మహిళ కౌన్సిలర్ భర్త తనను తాను చెప్పుతో కొట్టుకుని తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఐఎం పార్టీ నుంచి గెలిచి, కాంగ్రెస్ పార్టీ చైర్మన్ అభ్యర్థికి మద్దతు తెలిపి గెలిపించినందుకు ప్రాయశ్చిత్తంగానే ఈ నిర్ణయం తీసుకున్నానని ఆయన మీడియా ముఖంగా ఆవేదన, ఆక్రోశం వెళ్లగక్కారు. అంతేకాకుండా గత ఆరు నెలలుగా తమ వార్డులో కనీస అభివృద్ధి పనులు జరగడం లేదని, ఎన్నిసార్లు మున్సిపల్ చైర్మన్, కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా వారిలో కనీస చలనం కూడా లేదని మండిపడ్డారు. పలుమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని, తమ వార్డు ప్రజలకు సమాధానం చెప్పుకోలేక తీవ్ర మనోవేదనకు గురవుతున్నామని స్పష్టం చేశారు.అధికారం కోసం వాడుకుని ఇప్పుడు వదిలేస్తారాజహీరాబాద్ మున్సిపాలిటీలో యంఐఎం పార్టీ రెండు స్థానాలను కైవసం చేసుకుంది. చైర్మన్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీకి మద్దతు అవసరం కాగా, యంఐఎం సభ్యులు కాంగ్రెస్ కు మద్దతు తెలిపి వారిని చైర్మన్ పీఠంపై కూర్చో బెట్టారు. అంతేకాకుండా మా మద్దతుతో గెలిచిన తర్వాత, ఇప్పుడు మమ్మల్నే పక్కకు పెట్టి మా వార్డుల పట్ల కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం ఎంతవరకు సమంజసమని సూటిగా ప్రశ్నించారు. ఇది కాంగ్రెస్ చైర్మన్ ప్రదర్శిస్తున్న రాజకీయానికి నిదర్శనం అని దుయ్యబట్టారు. అంతేకాకుండా మేము మద్దతు ఇవ్వకపోతే మీరు ఆ కుర్చీలో కూర్చునే వారే కాదు అన్న వాస్తవాన్ని చైర్మన్ గుర్తుంచుకోవాలని, కేవలం పదవి దక్కేవరకే ఒక మాట, దక్కిన తర్వాత మరొక మాట మాట్లాడటం మానుకోవాలి. ఇకనైనా తక్షణమే మా వార్డులో ఆగిపోయిన అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలి. చైర్మన్, కమిషనర్, అధికారులు తమ మొండి వైఖరిని వీడి పనులను చేపట్టాలని, లేకపోతే రాబోయే రోజుల్లో ప్రజల పక్షాన ఇంతకంటే తీవ్రమైన ఆందోళన కార్యక్రమాలు చేపడతామని కౌన్సిలర్, మరియు భర్త హెచ్చరించారు.

# భారీ వర్షాలు అప్రమత్తమైన అధికారులు

- **కల్వర్టుల పరిశీలన.. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యం**

**ప్రజా వాయిస్/మోమిన్‌పేట్:**వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా గురువారం మోమిన్‌పేట్ తహశీల్దార్ మునీరుద్దీన్, ఎస్సై భరత్ భూషణ్ నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి మండలంలోని పలు స్థానిక కల్వర్టులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా కల్వర్టుల నిర్మాణ పరిస్థితి, బలహీనంగా ఉన్న ప్రాంతాలు, భారీ వర్షాలకు నీటి ప్రవాహానికి ఏర్పడే ఆటంకాలు, నీరు నిలిచిపోయే అవకాశాలపై అధికారులు సమగ్రంగా పరిశీలించి సంబంధిత శాఖ అధికారులతో చర్చించారు. వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా అవసరమైన చర్యలు చేపట్టాలని, ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.అదేవిధంగా వర్షాల సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా స్థానిక పరిస్థితులను సమీక్షించి, ప్రజలు ప్రమాదాలకు గురికాకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టారు. అత్యవసర పరిస్థితులు తలెత్తిన వెంటనే స్పందించేలా సంబంధిత శాఖల మధ్య సమన్వయం ఉండాలని అధికారులు స్పష్టం చేశారు.వర్షాకాలంలో ప్రజలు వాగులు, కల్వర్టుల వద్ద నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలు పాటించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.



## సర్ లో చివరి మూడు రోజులు కీలకం

- ఒక్క అర్హ ఓటు కూడా మిస్ కాకూడదు
- మిర్యాలగూడలో కాంగ్రెస్ నేతలు, బిఎల్ఎ లతో సమీక్ష సమావేశం
- వంద శాతం నమోదు లక్ష్యంగా క్షేత్రస్థాయిలో పని చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పిలుపు



**మిర్యాలగూడ,ప్రజా వాయిస్.**ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (SIR) ప్రక్రియలో మిగిలిన మూడు రోజులు అత్యంత కీలకమని, అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తప్పిపోకుండా ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త పూర్తి బాధ్యతతో పనిచేయాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, బూత్ లెవల్ ఏజెంట్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.సమావేశానికి ప్రభుత్వం విప్, ఎమ్మెల్సీ, నల్గొండ పార్లమెంట్ SIR ఇన్‌చార్జి బల్మూరి వెంకట్, కె. శ్రీనివాస్, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య, మిర్యాలగూడ నియోజకవర్గ SIR ఇన్‌చార్జి షబ్బీర్ అలీ, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పున్నా కైలాష్ నేతతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, పార్టీ నాయకులు, బీఎల్ఏలు పాల్గొన్నారు.ఎన్నికల కమిషన్ నిర్దేశించిన గడువు ఆగస్టు 3తో ముగియనున్న నేపథ్యంలో చివరి మూడు రోజులు ప్రతి బూత్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి అర్హులైన ప్రతి ఓటరిని గుర్తించి నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని నేతలు సూచించారు. సమన్వయంతో పనిచేస్తే వంద శాతం లక్ష్యాన్ని చేరుకోవడం సాధ్యమేనని అభిప్రాయపడ్డారు.



## రైతు గుండెల్లో గుబులు

- మోతేలో ఎండిపోతున్న పత్తి పంటల పరిశీలనలో మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్
- డిజాస్టర్ మేనేజ్ మెంట్ కింద వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్

**ప్రజా వాయిస్,మోతే:** సాగునీటి కొరతతో మోతే మండలంలో పత్తి పంటలు ఎండిపోతున్నాయని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. పంటలను పరిశీలించిన ఆయన, రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోకుండా ప్రభుత్వం వెంటనే పంట నష్టాన్ని అంచనా వేసి డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కింద నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రత్యామ్నాయ పంటలు వేయాలన్న వ్యవసాయ శాఖ సూచనలు అవాస్తవమని విమర్శించిన ఆయన, నాగార్జునసాగర్ ఎడమ కాలువ నుంచి నీరు విడుదల చేసి కోదాడ నియోజకవర్గంలోని చెరువులను నింపాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతుల పక్షాన తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు

# ప్రజలకు రక్షణ కవచంగా ఆపరేషన్ కవచ్

- నేరాల కట్టడికి కామారెడ్డి పోలీసుల వినూత్న ప్రయోగం
- జయప్రదం ఆదర్శంగా ఎస్పీ రాజేష్ చంద్ర స్పెషల్ ఆపరేషన్
- 10 అంతరాష్ట్ర దొంగల ముఠాలు కటకటాల పాలు
- ఐదు లక్షల వాహనాల తనిఖీలు
- 6 ఎన్ డి పి ఎస్ కేసుల్లో రెండు కోట్ల విలువైన గంజాయి స్వాధీనం
- 3572 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు శిక్షలు



**ప్రజా వాయిస్ కామారెడ్డి జిల్లాప్రతినిధి/**కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర దిశా నిర్దేశంలో ఏడాది కితం ప్రారంభమైన వినూత్న ఆపరేషన్ నేరగాళ్లలో వణుకు పుట్టింది. ప్రజలకు నమ్మకమైన రక్షణ కవచంలా నిలిచింది. ఎన్ ఫోర్స్ మెంట్ విభాగంలో 5 లక్షల వాహనాలు తనిఖీ చేసి అక్రమ రవాణా, గంజాయి సరఫరాను అరికట్టి యువత చెడు మార్గంలో పడకుండా చేశామని పోలీసులు చెబుతున్నారు. ఆరు ఇండిపిఎస్ కేసుల లో 18 మంది నిందితులను అరెస్టు చేశారు.403 కిలోల ఉన్న రెండు కోట్ల రూపాయల విలువైన గంజాయిని పట్టుకున్నారు. 21 లారీలు ట్రాక్టర్లు స్వాధీనం చేసుకొని అక్రమ ఇసుక,పశువుల రవాణ ఇతర అక్రమ రవాణాలను ఆపరేషన్ కవచ్ లో నిరోధించారు. సుమారు నాలుగున్నర లక్షల విలువైన అక్రమ పిడిఎస్ బియ్యం గుట్కా సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. దొంగిలించిన 18 మోటార్ సైకిలను స్వాధీనం చేసుకున్నారు. 3572 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసి వందల మందికి జైలు శిక్షలు పడేలా, తాగి వాహనాలు నడపకుండా నిరోధించారు. కామారెడ్డి జిల్లాలో 12 అంతరాష్ట్ర దొంగల ముఠాలు పలు దోపిడీలకు పాల్పడితే 10 ముఠాలను అరెస్టు చేసి జైలుకు పంపి దొంగల ముఠాల సంఖ్యను రెండు కు తగ్గించినట్లు జిల్లా ఎస్పీ వెల్లడించారు. ఒరిస్సా నుండి మహారాష్ట్ర నాసిక్ పట్టణానికిక పనస పండ్ల లారీలో అక్రమ గంజాయి సుమారు 400 కిలోలు రవన్న చేస్తుండగా క్యాసంపల్లి 44 జాతీయ రహదారి రాయల్ దాబా వద్ద పట్టుకుని అక్రమ రవాణా డ్రగ్స్ సంస్కృతిని నియంత్రించామని వెల్లడించారు.కామారెడ్డి నరసన్నపల్లి చౌరస్తాలో వణికిస్తున్న చలిలో ఆటో సీట్ల కింద అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పట్టుకున్నారు. గాంధారి అడవిలో మొండి సడక్ వద్ద 8 మంది అడవి జంతువుల వేటగాలను అరెస్టు చేసి నాటు తుపాకులను, ఒక గన్ను స్వాధీనం చేసుకున్నారు.రామారెడ్డి మండలం పోసానిnపేట లో రైతు పెంటయ్య పొలం వద్ద ఉంచిన ట్రాక్టర్ను అర్ధరాత్రి దొంగలించి పారిపోతుండగా రైతుకు ట్రాక్టర్ దొంగతనం జరిగిన విషయం తెలియక ముందే రెండు గంటల్లోనే పట్టుకుని యజమానికి 5 లక్షల ట్రాక్టర్లు అప్పగించినట్లు ఆపరేషన్ కవచ్ జయప్రదంగా సాగుతున్నట్టు వెల్లడించారు.నాగిరెడ్డిపేటలో 43 కేసుల్లో హిస్టరీ కేసులున్న ప్రధాన దొంగ చింతా బాలరాజు ఆటో దొంగలించి పారిపోతుండగా ప్రజల సహకారంతో పోలీసులు ఉమ్మడి వేట సాగించి ఎనిమిది కిలోమీటర్లు వెంబడించి ప్రధాన దొంగ,మరి నలుగురి ఇతర దొంగలను పట్టుకున్నారు.నేరాలను అరికట్టడానికి దొంగలను పట్టుకోవడానికి రాత్రంతా ఆపరేషన్ కవచ్ లో భాగంగా వాహనాలను ప్రధాన రహదారు లలో జిల్లాల్లో 22 చెకింగ్ పాయింట్లు ఏర్పాటు చేసి వాహనాల తనిఖీ జరుగుతుందన్నారు.సదాశివ నగర్ మండలం 44 జాతీయ రహదారి పద్మాజి వాడిలో ఎల్లమ్మ గుడిలో జరిగిన దొంగతనంలో అంతర్ రాష్ట్ర దొంగను గంటల వ్యవధిలో పట్టుకున్నామన్నారు. లింగాపూర్ దోపిడీ కేసులో డయల్ 100 కు సమాచారం రావడంతో జియో ఫెన్సింగ్ పద్ధతిలో డ్రెస్ కోడ్ ఆధారంగా పాత నేరస్తుడు రాథోడ్ బోజ్జును అరెస్టు చేశారు.తల్లి మందలించిందని అర్ధరాత్రి 14ఏళ్ల బాలుడు నిజాంబాద్ నుండి కామారెడ్డికి 50 కి.మీ సైకిల్ పై వస్తుండగా మానవత దృక్పథంతో కన్నతల్లికి అప్పగించామని, భిక్కనూరు టోల్ ప్లాజా వద్ద ఒకేసారి 11:39 వాహనాలు తనిఖీ చేసినట్లు ఎస్పీ తెలిపారు. ప్లాజా వద్దమద్యం మత్తులో ఖురానా ప్రైవేట్ ట్రావెల్ బస్సు డ్రైవర్ ను పట్టుకొని 45 మంది అమాయకుల ప్రాణాలు కాపాడమన్నారు. ప్రజలకు భరోసా నేరస్తులకు భయం పుట్టించేందుకు ఆపరేషన్ కవచ్ రాత్రిపూట తనిఖీలు చేపట్టామని ప్రజలకు ప్రయాణికులకు ఇబ్బంది కలిగించడానికి కాదని కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర స్పష్టం చేశారు ఆపరేషన్ కవచ్ లో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులకు సిబ్బందికి ఎస్పీ ప్రశంసలు సత్కారాలు అందజేశారు.

# అది 'కబ్జా' కాదు.. హక్కు ప్రకారమే డెవలప్‌మెంట్!

- వేములపల్లి వెంకటమ్మ పెద్ద కూతురు ఉపేంద్ర, భాగస్వాముల సంచలన ఆరోపణలు





**మహబూబాబాద్ జిల్లా (గూడూరు):**గూడూరు సర్వే నంబర్ 115/A లోని భూమిపై గత కొన్ని రోజులుగా జరుగుతున్న ప్రచారాన్ని వేములపల్లి వెంకటమ్మ పెద్ద కూతురు దారం ఉపేంద్ర తీవ్రంగా ఖండించారు. మోహన్ కుమార్ అనే వ్యక్తి స్వార్ధ ప్రయోజనాల కోసమే తమపై భూకబ్జాదారంటూ అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దారం ఉపేంద్రతో పాటు మోతే వేణుప్రసాద్ రెడ్డి, ననబాల శ్రీనివాస్, పెసర శివ పాల్గొని వివరాలు వెల్లడించారు.

### మోహన్ కే భూమితో సంబంధం లేదు.. సంచలన ఆరోపణలు!

విలేకరుల సమావేశంలో మోతే వేణు ప్రసాద్ రెడ్డి, ననబాల శ్రీనివాస్ యాదవ్, పెసర శివ, మాట్లాడుతూ వేములపల్లి మోహన్‌పై సంచలన ఆరోపణలు చేశారు. సర్వే నంబర్ 115/A పరిధిలోని మిగతా భూమికి సంబంధించి మోహన్ కుమార్ తీవ్రమైన మోసాలకు పాల్పడ్డాడని ధ్వజమెత్తారు.కొందరు వ్యక్తుల పేరు మీద అక్రమంగా లీజ్ డీడ్ చేయించి, డబుల్ డాక్యుమెంట్లు (నకిలీ పత్రాలు) సృష్టించాడని వారు ఆరోపించారు.అసలైన హక్కుదారులను బురిడీ కొట్టిస్తూ, తప్పుడు పత్రాలతో భూమిని కాజేసేందుకు మోహన్ కుమారే కుట్రలు పన్నుతున్నారని స్పష్టం చేశారు.

### .మా అమ్మ రాసిచ్చిన హక్కు ప్రకారమే డెవలప్ మెంట్

దారం ఉపేంద్ర మాట్లాడుతూ... ఈ సర్వే నంబర్‌లోని భూమి తమ తల్లి వేములపల్లి వెంకటమ్మ గారి స్వార్జిత ఆస్తి అని తెలిపారు. తమ తల్లి బతికుండగానే రాసిన వీల్ డీడ్ ఆధారంగా మోహన్ కుమార్ తల్లికి దక్కాల్సిన 14 గుంటల భూమిని గతంలోనే అప్పగించామన్నారు. వీల్ డీడ్ ప్రకారం పెద్ద కూతురిగా తనకు సంక్రమించిన చట్టబద్ధమైన వాటాతో పాటు, తల్లి మరణానంతరం తనకు వచ్చిన భూమి అభివృద్ధి (డెవలప్మెంట్ ) కోసమే మోతే వేణు ప్రసాద్ రెడ్డి, ననబాల శ్రీనివాస్, పెసర శివలకు ఇచ్చానని స్పష్టం చేశారు.

### తప్పుడు ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు!

తమ భూమిని క్రమబద్ధంగా డెవలప్‌మెంట్ చేస్తుంటే, తట్టుకోలేక మోహన్ కుమార్ ప్లాట్లు కొనుగోలు చేసేవారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. డబుల్ డాక్యుమెంట్లు సృష్టించి మోసాలకు పాల్పడుతున్న మోహన్ కుమార్‌పై మరియు తమపై తప్పుడు వార్తలు రాయిస్తున్న వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# సొంత ఊరి ప్రజలకే ఇళ్లు లేవు

- మంత్రి శ్రీధర్ బాబుకు చిత్తశుద్ధి ఎక్కడ?
- బీజేపీ తీవ్ర ధ్వజం



**ప్రజా వాయిస్ కాటారం** సొంత నియోజకవర్గం, భూపాలపల్లి జిల్లా కాటారం మండల ప్రజలను విస్మరించి, దేవుడిలా కొలిచి ఓట్లేసిన ప్రజలను గుడిసెలకే పరిమితం చేశారని రాష్ట్ర పరిశ్రమలు, సమాచార సాంకేతిక శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుపై భారతీయ జనతా పార్టీ నాయకులు చల్ల నారాయణ రెడ్డి విమర్శలు గుప్పించారు. శ్రీధర్ బాబుకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే, ఆయన సొంత ఊరు ధన్వాడకు కేవలం 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒడిపిలవంచ గ్రామంలో ఇళ్లు లేక అవస్థలు పడుతున్న హరిజన కుటుంబాలకు తక్షణమే 200 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించి కట్టించాలని డిమాండ్ చేశారు.

### ప్రజలు గుడిసెలలో... నాయకులు రాజభవనాల్లో!

ఓట్లేసి గెలిపించిన మంథని నియోజకవర్గ ప్రజల కష్టాలను గాలికొదిలేసి మంత్రి గారు అమెరికా, హైదరాబాద్‌లలో తిరుగుతూ కాలక్షేపం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌గా ఉన్నానని, రాష్ట్రంలో సీఎం తర్వాత సీఎంను నేనేనని గొప్పలు చెప్పుకోవడం తప్ప, సొంత ఊరికి, సొంత నియోజకవర్గానికి చేసిన మేలేమిటని ప్రశ్నించారు.అకాల వర్షాల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు కొట్టుకుపోయి, సరైన ఆవాసం లేక ప్లాస్టిక్ పరదాల కింద ప్రజలు అరిగోస పడుతుంటే మంత్రిగారికి వారి కష్టాలు కనిపించడం లేదా అని ఆక్రోశం వ్యక్తం చేశారు.

### మద్యం, డబ్బులతో మళ్లీ గెలుస్తామనే అహంకారమా?

"ఎన్నికల సమయంలో మద్యం, డబ్బులు పంచి మళ్లీ గెలిచిపోవచ్చు" అనే అహంకారంతోనే ప్రజల సమస్యలను పక్కనబెట్టారా అని నిలదీశారు. నియోజకవర్గంలో ప్రజల కష్టసుఖాలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు.

### బీజేపీ డిమాండ్:

ఒడిపిలవంచ గ్రామంలో ఇళ్లు లేక అవస్థలు పడుతున్న పేద కుటుంబాలకు, హరిజనులకు తక్షణమే 200 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి, వాటి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని, లేనిపక్షంలో బాధితుల పక్షాన బీజేపీ పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతుందని హెచ్చరించారు.

# కాజీపేట కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి

- కాజీపేటను రైల్వే డివిజ న్ చేయాలి
- ఈ పార్ల మెంట్ సమావేశాల్లోనే రైల్వే డివిజ న్ ప్రకటించాలి
- సెంట్ర లైజ్డ్ క్రూ లాబీ ఏర్పాటు చేయాలి
- తెలంగాణ పై కేంద్ర ప్రభుత్వ సవతి తల్లి ప్రే
- తెలంగాణ న్యాయ పరమైన డిమాండ్ల సాధన లో కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు విఫలం
- బీఆర్ఎస్ పార్టీ వరంగల్ పశ్చిమ నియోజక వర్గ నాయకులు



**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద గురువారం శాంతియుత ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించి కేంద్రం ప్రభుత్వ వైఖరిపై నిరసన తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... కాజీపేటలో కోచ్‌ఫ్యాక్టరీని ప్రభుత్వమే నిర్వహించాలని, కోచ్‌ఫ్యాక్టరీలో 80 శాతం ఉద్యోగాలు స్థానికులకే కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ సూచనల మేరకు గురువారం జంతర్ మంతర్ వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పేర్కొన్న విధంగా కాజీపేట కేంద్రంగా రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే రైల్వే డివిజన్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కాజీపేట నుంచి క్రూలింక్‌లను తరలించవద్దని, కాజీపేటకు సమీపంలో ఉన్న బోడగుట్ట వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. వరంగల్ లేదా కాజీపేట కేంద్రంగా సెంట్రలైజ్డ్ క్రూ లాబీ ఏర్పాటు చేయాలని, చిరు వ్యాపారులకు వెండింగ్ జోన్‌లు ఏర్పాటు చేయాలని, స్థానిక ఐటీఐ విద్యార్థులకు అప్రెంటిస్ ఇవ్వాలని, వరంగల్‌లో ఉన్న రైల్వే స్టేడియాన్ని అభివృద్ధి చేయాలని, రైల్వే స్టేషన్ల ఎదుట ఉన్న ఆటో అడ్డాల నుంచి ఎటువంటి రుసుము వసూలు చేయవద్దని, ఫాతిమా బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయడం కోసం రైల్వే శాఖ సహకరించాలని కోరారు. కాజీపేట కేంద్రంగా కొత్త రైలు సర్వీసులు మొదలుపెట్టాలని, రైల్వే బడ్జెట్‌లో తెలంగాణకు అత్యధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 12 ఏండ్లుగా తెలంగాణపై సవతి తల్లి ప్రేమ చూపుతోందని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని హక్కులను సైతం కేంద్రం అమలు పరచడం లేదని గుర్తు చేశారు. తెలంగాణ హక్కుల కోసం కొట్లాడాల్సిన తెలంగాణకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు కేంద్రం నుంచి తెలంగాణకు రావాల్సిన నిధులను తీసుకురావడంలో విఫలమయ్యారని విమర్శించారు. తెలంగాణ హక్కు ల కోసం బీఆర్ఎస్ పార్టీ పోరాడుతోందని . బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ మంత్రివర్యులు కేటీఆర్ ఇటీవలే కేంద్ర రైల్వే శాఖ మంత్రి సైతం కలిసి తెలంగాణకు దక్కాల్సిన హక్కుల గురించి వివరించి, మంజూరు చేయాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు నార్లగిరి రమేష్, మాజీ కార్పొరేటర్లు జోరిక రమేష్, సంకు నర్సింగ రావు, బొంగు అశోక్ యాదవ్, నాయకులు పులి రజినీకాంత్ ముదిరాజ్, పోలపెల్లి రామ్మూర్తి, అఫ్జల్ , గబ్బేట శీను, నరసింహారావు, దువ్వ కనకరాజు, కొండ రాజు, పులి విక్రమ్, బరిగెల వినయ్, పున్నం చందర్, తండమళ్ల వేణు, చుంచు అశోక్, నరేష్, సాధినేని సుధాకర్, దశరథం, రాబర్ట్, వంశీ, గణేష్, చందు, హుస్సేన్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# కమలా నెహ్రూ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన మాజీ ఎమ్మెల్యే

**నల్గొండ క్రైమ్ /ప్రజా వాయిస్:**నల్గొండ జిల్లా నాగార్జున సాగర్ లోని కమలా నెహ్రూ ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించి రోగులతో మాట్లాడి వారి సాధకబాధకాలను తెలుసుకున్న నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్.ఈ సందర్భంగా రోగులతో మాట్లాడుతూ విస్తుపోయే నిజాలను వారి వద్ద నుంచి అడిగి తెలుసుకున్నారు, డాక్టర్లు సమయపాలన పాటించకపోవడంతో పాటు, అత్యవసర సేవలకు వినియోగించాల్సిన మందులను అందుబాటులో లేవని తెలుసుకొని స్టాక్ రిజిస్టర్ లను, ఇండెంట్ పెట్టిన మందులను స్టోర్ రూమ్ లో పరిశీలించారు.హాస్పిటల్ ను సందర్శించడానికి వచ్చిన మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కు రోగులు ఒక్కసారిగా గుమ్మికూడి ఆసుపత్రికి వచ్చిన తర్వాత వారు ఎదుర్కొంటున్న సమస్యలను గత ప్రభుత్వంలో బాలింతలకు అందించిన కెసిఆర్ కిట్టుగాని, అప్పుడే పుట్టిన బిడ్డలకు అందాల్సిన వ్యాక్సిన్లు గాని అందుబాటులో ఉండడం లేదని, డాక్టర్లు ఎవరు సమయపాలన పాటించకుండా అత్యవసర సేవలకు అందుబాటులో ఉండడం లేదన్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకొచ్చారు రోగులు.అనంతరం నోముల భగత్ మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నాయకులు చేతులో కత్తెర్లు పట్టుకొని బిఆర్ఎస్ పార్టీ హయాంలో నిర్మాణం చేపట్టిన భవనాలను ప్రారంభించడానికి మాత్రమే తిరుగుతున్నారన్న విషయాన్ని కత్తెర్ల కాంగ్రెస్ అంటూ ప్రజలు చర్చించుకుంటున్నారని ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.వందల కోట్ల రూపాయలు ప్రజాధనాన్ని హంగు, ఆర్భాటాలకు వృధా చేయకుండా ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేదలకు వైద్యం అందించడానికి ఖర్చు చేస్తే బాగుంటుందని, గతంలో బాలింతలకు అందించిన కెసిఆర్ కిట్టు లాంటి పథకాలకు కేసీఆర్ పేరు వింటేనే దడుచుకునే ముఖ్యమంత్రి కాంగ్రెస్ ప్రభుత్వం పేరు మార్చుకొని అయినా పేదలకు సంక్షేమ పథకాలను అందించాలని హితవు పలికారు,కమలా నెహ్రూ ఆసుపత్రికి చైర్మన్ గా ఉండే స్థానిక ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి నియోజకవర్గంలోని పేదలకు వైద్యం అందించడంలో పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. రోజుల్లో ఇదే పరిస్థితి కొనసాగితే పేదల కోసం సెంట్రల్ డ్రగ్స్ స్టోర్ ముందు ధర్నా చేయడానికి కూడా బిఆర్ఎస్ పార్టీ ముందుంటుందని మండిపడ్డారు నోముల భగత్.ఈ కార్యక్రమంలో చెన్ను సుందర్ రెడ్డి, హీరే కార్ రమేష్ జి, లక్మాల మధు బాబు, సయ్యద్ మక్బూద్, మహమ్మద్ గని, కోడా విజయ్, యాల విజయ్, ఆదాసు విక్రమ్, బండారు లక్ష్మీనారాయణ, జిలాని, కోడా కోదండ, నజీర్, మంద శాంతకుమారి, రఫీ,లక్ష్మణ్ నాయక్, అర్జున్ నాయక్, మహేష్ నాయక్, ధారా రవి, బహదూర్, సునీల్ తదితరులు పాల్గొన్నారు..





## ఉద్యమకారిణి మరణం... అనాథలా మారిన కుటుంబం

- ఉద్యమ సేవలకు గుర్తింపుగా లలిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి
- తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర సమన్వయకర్త గడ్డం వెంకట్ రెడ్డి

**చేవెళ్ల (ప్రజావాయిస్ ):** మొయినాబాద్ మున్సిపాలిటీ ఎన్కేపల్లికి చెందిన తెలంగాణ ఉద్యమకారిణి వడ్ల లలిత అనారోగ్యంతో శుక్రవారం ఉదయం కన్నుమూశారు. ఆమె మృతి పట్ల తెలంగాణ ఉద్యమ నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర సమన్వయకర్త గడ్డం వెంకట్ రెడ్డి, తెలంగాణ దళిత ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కర్రె సునీల్ కుమార్, మొయినాబాద్ మండల టీయూఎఫ్ అధ్యక్షుడు నేలటి మహిపాల్ లలిత భౌతిక కాయాన్ని సందర్శించి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# గల్లీల్లో నడుస్తూ... సమస్యల గుండెల్లోకి వెళ్లిన ఎమ్మెల్యే

- చండూరు నుంచి పుల్లెంల వరకు మార్నింగ్ వాక్ లో ప్రజలతో ముఖాముఖి
- అభివృద్ధి పనులపై క్షేత్రస్థాయిలో సమీక్ష.
- ప్రతి గల్లీలో ప్రజల సమస్యలు తెలుసుకుంటూ అధికారులకు ఆదేశాలు
- పేదల గుడిసెల వద్దకు వెళ్లి ఇందిరమ్మ ఇళ్లపై ఆరా
- రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, ప్రభుత్వ భవనాలపై ప్రత్యేక దృష్టి
- మున్సిపల్ కార్యాలయానికి సరైన స్థలం ఉండాలంటూ స్పష్టమైన సూచన
- ప్రజా అవసరాల కోసం దేవాదాయ భూముల కేటాయింపునకు చర్యలు



**ప్రజా వాయిస్, మునుగోడు.**ఫైళ్లలో కాదు... గల్లీల్లో నడుస్తూ ప్రజల నోట సమస్యలు వింటూ వాటి పరిష్కారానికి అక్కడి కక్కడే అధికారులకు ఆదేశాలు జారీ చేయడం ద్వారా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి క్షేత్రస్థాయి పాలనకు ప్రాధాన్యం ఇచ్చారు. చండూరు మున్సిపాలిటీతో పాటు పుల్లెంల గ్రామంలో నిర్వహించిన మార్నింగ్ వాక్ సందర్భంగా ప్రతి వీధి, ప్రతి కాలనీ, ప్రతి ప్రభుత్వ భవనాన్ని పరిశీలిస్తూ అభివృద్ధి పనులపై సమగ్ర సమీక్ష నిర్వహించారు.చండూరు మున్సిపాలిటీలోని జంగాల కాలనీలో కాలనీవాసులతో నేరుగా మాట్లాడిన ఎమ్మెల్యే తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, గృహ స్థలాల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరో 25 సంవత్సరాలకు సరిపడేలా మున్సిపాలిటీ అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. అంతర్గత రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, తాగునీటి వ్యవస్థను ఆధునికీకరించేందుకు అంచనాలు రూపొందించాలని ఆదేశించారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే పాత భవనాన్ని తొలగించి కొత్త భవనం నిర్మించాలని సూచించారు. యునాని విభాగాన్ని పరిశీలించిన సందర్భంగా అక్కడి వైద్యురాలు వివరించిన యునాని వైద్య విధానంపై ఆసక్తి చూపి స్వయంగా మందులు తీసుకున్నారు. ప్రజల్లో యునాని వైద్యంపై అవగాహన పెంచాలని వైద్య సిబ్బందికి సూచించారు.మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న మున్సిపల్ కార్యాలయానికి సరైన రహదారి సౌకర్యం లేక పోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని విశాల స్థలంలో ఆధునిక మున్సిపల్ కార్యాలయాన్ని నిర్మించేందుకు ప్రత్యామ్నాయ స్థలాలను గుర్తించాలని ఆదేశించారు. ఈ అంశంపై రాష్ట్ర మున్సిపల్ శాఖ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి అవసరమైన అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు.అనంతరం పుల్లెంల గ్రామంలో మార్నింగ్ వాక్ నిర్వహించిన ఎమ్మెల్యే గల్లీలన్నీ తిరుగుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. పేదల గుడిసెల్లోకి వెళ్లి వారి జీవన పరిస్థితులను పరిశీలించి, ఇందిరమ్మ ఇళ్లకు అర్హులై సాంకేతిక కారణాలతో మంజూరు నిలిచిపోయిన కుటుంబాలను గుర్తించాలని అధికారులకు ఆదేశించారు. కొత్తగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి లబ్ధిదారులను అభినందించారు.ఇడికుడ–తెరటిపల్లి రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తూ ప్రభావితమయ్యే ఇళ్ల వివరాలను తెలుసుకున్నారు. నిర్మాణంలో ఉన్న అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక ఉప ఆరోగ్య కేంద్రం, గ్రామపంచాయతీ భవనం, కమ్యూనిటీ హాల్ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాలను అనుసంధానించే రహదారులు, అంతర్గత వీధులు, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.పుల్లెంల ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించిన సందర్భంగా కొత్త పాఠశాల భవనం, విశాలమైన ఆటస్థలం కోసం భూమి అవసరమని గుర్తించిన ఎమ్మెల్యే, గ్రామంలోని దేవాదాయ శాఖ భూమిని ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించాలని దేవాదాయ శాఖ కమిషనర్‌కు ఫోన్ చేసి విజ్ఞప్తి చేశారు. పాఠశాలలు, ప్రభుత్వ భవనాలు, ప్రజలకు ఉపయోగపడే ఇతర నిర్మాణాలకు భూమి కేటాయించాలని కోరారు.చండూరు అయినా... పుల్లెంల అయినా... ప్రజల మధ్యే తిరుగుతూ, గల్లీల్లోనే సమస్యలను గుర్తిస్తూ, అక్కడికక్కడే పరిష్కార మార్గాలను సూచించిన ఎమ్మెల్యే పర్యటన స్థానికుల్లో చర్చనీయాంశంగా మారింది. అధికారులు కేవలం కార్యాలయాల్లోనే కాకుండా క్షేత్రస్థాయిలోకి వెళ్లి సమస్యలు గుర్తించి పరిష్కారాలు చూపాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.



## 48 గంటల వాన.. కామారెడ్డి జలకళ

- పోచారం, కళ్యాణి, కౌలాస్ నాల ప్రాజెక్టులు నిండుకుండలా
- నిజాంసాగర్ కు భారీ వరద.. పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

**ప్రజావాయిస్, కామారెడ్డి జిల్లా ప్రతినిధి:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా ముసురు వర్షాలు కురుస్తున్నాయి. 48 గంటలుగా కురుస్తున్న వర్షాలతో జిల్లాలోని నీటి వనరులు జలకళను సంతరించుకున్నాయి. వారం రోజుల క్రితం డెడ్‌స్టోరేజీ స్థాయిలో ఉన్న పోచారం ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండగా, ఎల్లారెడ్డి మండలంలోని కళ్యాణి, జుక్కల్ మండలంలోని కౌలాస్‌నాల ప్రాజెక్టులు కూడా నిండుకుండలా మారాయి. మంజీరా నదిపై ఉన్న నిజాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు చేరుతోంది.జిల్లాలోని పెద్దవాగు, నల్లవాగు, గుజ్జుల వాగు, కూడెల్లి వాగు, ఎడ్లకట్ట వాగు తదితర వాగులు ఉప్పొంగి ప్రవహిస్తుండగా, చెరువులు, కుంటలు వేగంగా నిండుతున్నాయి. కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల్లో భారీ వర్షాలు నమోదయ్యాయి. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు కామారెడ్డి కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు.గత నెల రోజులుగా లోటు వర్షపాతంతో ఆందోళనలో ఉన్న రైతులకు ఈ వర్షాలు ఊరటనిచ్చాయి. సాగునీటి వనరులు పుష్కలంగా నిండుతుండటంతో ఖరీఫ్ సాగుపై ఆశలు చిగురించాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## సబ్సిడీ లోన్ పేరిట వల.. లక్షల్లో డీల్, బైక్‌తో పరార్!

- వెల్డింగ్ కార్మికుడికి రూ. 30 వేలు టోకరా
- గంగారం ఎంపీడీఓ ఆఫీస్ అటెండర్ పై బాధితుడి పోలీసు ఫిర్యాదు
- ప్రభుత్వ సబ్సిడీ లోన్ ఇప్పిస్తానంటూ నమ్మబలికి .ఓ అమాయక కార్మికుడిని ఘోరంగా మోసగించిన సంఘటన



**ప్రజా వాయిస్/మహబూబాబాద్** జిల్లా (కొత్తగూడ) మండల కేంద్రంలో వెలుగు చూసింది. రూ. 30 వేల నగదుతో పాటు బాధితుడి కొత్త బైక్‌ను కూడా ఎత్తుకెళ్లిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది.కొత్తగూడ మండల కేంద్రంలో బిలాల్ అనే వ్యక్తి వెల్డింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా, వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలానికి చెందిన జక్కుల మహేష్ అనే వ్యక్తి బిలాల్‌కు పరిచయమయ్యాడు. తనకు ప్రభుత్వ సబ్సిడీ లోన్ మంజూరు చేయిస్తానని, అందుకోసం రూ. లక్ష కమిషన్ ఇవ్వాలని నమ్మబలికాడు. మహేష్ మాటలను నిజమని నమ్మిన బిలాల్.. అడ్వాన్స్‌గా రూ. 30,000 నగదును చెల్లించాడు.నగదు తీసుకున్న తర్వాత కేటుగాడు మహేష్ తన బుద్ధి చూపించాడు. లోన్ మంజూరైందని కట్టుకథలు చెప్పి బిలాల్‌కు చెందిన కొత్త బైక్‌ను బలవంతంగా తీసుకెళ్లాడు. ఒప్పందం ప్రకారం మిగతా డబ్బులు పూర్తిగా ఇస్తేనే బైక్ తిరిగి ఇస్తానని, లేకపోతే ఇవ్వనని బెదిరింపులకు దిగాడు. బాధితుడు ఎంత వేడుకున్నా వినకుండా బైక్‌తో పరారయ్యాడు.బాధితుడిని మోసం చేసిన జక్కుల మహేష్ ప్రస్తుతం గంగారం మండలం ఎంపీడీఓ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ కార్యాలయంలో పనిచేస్తూ ఇలా అమాయక ప్రజలను మోసగించడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.తాను మోసపోయానని ఆలస్యంగా గ్రహించిన బాధితుడు బిలాల్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో జక్కుల మహేష్‌పై ఫిర్యాదు చేశాడు. నిందితుడి వద్ద నుంచి తన రూ. 30,000 నగదుతో పాటు బైక్‌ను రికవరీ చేసి ఇప్పించాలని, అమాయకులను మోసం చేస్తున్న నిందితుడిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను వేడుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.



## శివాజీ చౌక్ టర్నింగ్ వద్ద ప్రమాదకర రహదారి

- మరమ్మతులు చేయాలని డిమాండ్

**ప్రజా వాయిస్ కగజ్ నగర్** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం ఈస్‌గావ్‌లోని శివాజీ చౌక్ టర్నింగ్ వద్ద రహదారి భారీ గుంతలతో ప్రమాదకరంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలతో గుంతల్లో నీరు నిలిచిపోవడంతో ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రమాదాల ముప్పు ఎక్కువగా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే స్పందించి దెబ్బతిన్న రహదారికి మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు నివారించాలని అధికారులు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు, వాహనదారులు కోరుతున్నారు.

## టీపీబీవో డమ్మీనా..?

- టౌన్ ప్లానింగ్ లో 'ఆ'అధికారిదే పెత్తనమా..?
- టీపీబీవో లాగిన్ ను మరో అధికారి దుర్వినియోగం చేస్తున్నారా..?
- కర్త,కర్మ,క్రియ'అంతా ఒకరిదేనా..?
- సమగ్ర విచారణకు స్థానికుల డిమాండ్



**రాజేంద్రనగర్,జూలై** 30 (ప్రజావాయిస్)జీహెచ్ఎంసీ జోన్ పరిధి రాజేంద్రనగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ విభాగంలో అక్రమాల నీడలు కమ్ముకున్నాయా..? నిబంధనలను పాతరేసి ఒకరి అధికారాలను మరొకరు చలామణి చేస్తున్నారా..? అంటే అవుననే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సర్కిల్ పరిధిలో టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్ (టీపీబీవో)గా విశాల్ రెడ్డి విధులు నిర్వహిస్తుండగా, ఆయన కేవలం"పేరుకే అధికారిగా మిగిలిపోయారన్న,టాక్ కార్యాలయంలో గట్టిగా వినిపిస్తోంది.కార్యాలయ వ్యవహారాలు,నిర్ణయాలు, చివరికి డిజిటల్ అధికారాల వరకు అంతా టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీధర్ గుప్పెట్లోనే నడుస్తున్నాయనే గుసగుసలు టౌన్ ప్లానింగ్ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతున్నాయి.

### లాగిన్ 'హైజాక్'..?

నిబంధనలకు విరుద్ధంగా వ్యవహారం,పాలనా సౌలభ్యం కోసం, పారదర్శకత కోసం ప్రభుత్వం కేటాయించిన అత్యంత కీలకమైన టీపీబీవో అధికారిక డిజిటల్ లాగిన్‌ను కూడా శ్రీధరే స్వయంగా వినియోగిస్తున్నారని బలంగా ఆరోపణలు వస్తున్నాయి.డిజిటల్ సంతకాలు,అనుమతుల ప్రక్రియకు సంబంధించి లాగిన్ ఐడీలను ఇతరులకు అప్పగించడం ప్రభుత్వ విధివిధానాలకు,ఐటీ నిబంధనలకు స్పష్టమైన ఉల్లంఘనేనని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.సదరు విభాగంలో జరుగుతున్న వ్యవహారాలపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. టీపీబీవో అధికారాన్ని శ్రీధర్ ఎందుకు హస్తగతం చేసుకున్నారనేది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది.

### "షాడో"అధికారిపై చర్యలు తీసుకోవాలి..?

టౌన్ ప్లానింగ్ విభాగంలో 'కర్త,కర్మ,క్రియ'అంతా ఒకే అధికారి చేతుల్లో నడుస్తోందన్న వార్తలు సర్కిల్‌లో హాట్ టాపిక్‌గా మారాయి.ఈ వ్యవహారంపై జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు, విజిలెన్స్ విభాగాలు తక్షణమే స్పందించి సమగ్ర విచారణ జరపాలని, స్థానికులు,ప్రజాప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. లాగిన్ వినియోగంపై సాంకేతిక తనిఖీలు చేపడితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని భావిస్తున్నారు. ఆరోపణలు గనుక నిజమని తేలితే,నిబంధనలను ఉల్లంఘించిన అధికారులపై చట్టపరమైన,శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.




## దశబ్దాలు గడచినా బట్వాన్ పల్లి, పెర్కపల్లి మధ్యలో వాగుపై బ్రిడ్జ్ కల కలగానే వుంది

- ప్రభుత్వాలు మారిన నాయకులు మారిన రోడ్డు పై బ్రిడ్జ్ మాత్రం కట్టలేదు
- ఇచ్చిన హామీలు గాలిలో కలిశాయి



**ప్రజా వాయిస్ బెల్లంపల్లి రూరల్**.మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలములోని బట్వాన్ పల్లి నుండి బెల్లంపల్లి కి వెళ్లే మెయిన్ రోడ్డు పై నుండి గత రెండు రోజులు నుంచి కురుస్తున్న వర్షం వల్ల పలు గ్రామాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. పెర్కపల్లి, గుండ్ల సోమరం, నార్వేపేట మెట్ పల్లి, చిత్తపూర్, గ్రామలకి రాకపోకలు స్థంభించిపోయాయి. మా యొక్క గ్రామం పెర్కపల్లి నుండి బట్వాన్ పల్లి నుండి ఇలాంటి పరిస్థితి ఉంది మాకు బెల్లంపల్లి మండలం కు పోవడానికి కూడా వెళ్లలేని పరిస్థితి ఉంది. బెల్లంపల్లి స్థానిక ఎమ్మెల్యేలు కూడా గత సంవత్సరాల నుంచి గెలిచిన ఎక్కడ పరచిన గొంగడి అక్కడే అన్నట్టు వ్యవహారిస్తుంది. ఎమ్మెల్యే లకి ఎన్నోసార్లు విషయన్ని వెల్లడించిన ఇప్పటి వరకు పట్టించుకోని ఎమ్మెల్యేలు లేరు. ప్రజలకి ఉపయోగ పడని ఎమ్మెల్యేలు ఎందుకు ఈ వ్యవస్థ ఇలానే దుర్వినియోగం అవుతుంది. ఇప్పటికైనా పట్టించుకోని బట్వాన్ పల్లి, పెర్కపల్లి కి మధ్యలో ఈ వాగు పై బ్రిడ్జ్ సంష్టున్ చేయాలని ప్రజలు రైతులు కోరుకుంటూన్నారు.



## సోలార్ యూనిట్ల ఏర్పాటును వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి** హనుమకొండ జిల్లా పరకాల నియోజకవర్గం ఆత్మకూర్ మండల కేంద్రంలో అమలవుతున్న మోడల్ సోలార్ విలేజ్ కార్యక్రమం కింద మిగిలిన లబ్ధిదారుల ఇళ్లపై సోలార్ యూనిట్ల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సంబంధిత అధికారులను ఆదేశించారు.గురువారం ఆత్మకూర్ లో మోడల్ సోలార్ విలేజ్ పథకం అమలును కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన గొల్లపల్లి గణపతి నివాసంలో ఏర్పాటు చేసిన సోలార్ యూనిట్‌ను పరిశీలించి, దాని పనితీరు, నిర్వహణ విధానం గురించి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. సోలార్ విద్యుత్ వినియోగం వల్ల కలుగుతున్న ప్రయోజనాలపై వారితో మాట్లాడారు.అనంతరం గ్రామంలో సోలార్ యూనిట్ల ఏర్పాటు పురోగతిపై తెలంగాణ రెడ్‌కో, విద్యుత్ శాఖ అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. మొదటి విడతలో అర్హులైన 764 మంది లబ్ధిదారులకు సోలార్ యూనిట్లు మంజూరుకాగా, ఇప్పటివరకు 251 ఇళ్లలో సోలార్ యూనిట్లను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన ఇళ్లకు అవసరమైన సామగ్రిని త్వరలోనే అందుబాటులోకి తీసుకువచ్చి, ఏర్పాటు పనులను పూర్తి చేస్తామని కలెక్టర్‌కు వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మోడల్ సోలార్ విలేజ్‌గా ఎంపికైన ఆత్మకూర్ గ్రామంలో మిగిలిన లబ్ధిదారుల ఇళ్లలో కూడా సోలార్ యూనిట్లn ఏర్పాటు ఆలస్యం కాకుండా అవసరమైన మెటీరియల్‌ను వెంటనే సమీకరించి పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సోలార్ విద్యుత్ వినియోగం ద్వారా విద్యుత్ ఖర్చులు తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ గ్రామ సర్పంచ్ మహేశ్వరి, టీజీ రెడ్‌కో ఫీల్డ్ అధికారులు దీపక్, నవీన్ కుమార్ యాదవ్, ఆత్మకూర్ తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, విద్యుత్ శాఖ అధికారులు భరత్ కుమార్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.